Email:prajamantalu@gmail.com

www.prajamantalu.com

# ప్రజా మంటలు

సంపుటి: 4 సంచిక: 162

పేజీలు - 8 వెల- రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శుక్రవారం 02, ఫిబ్రవరి-2024

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## ఇంద్రవెల్లి వేదికగా కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం



3లో..



# వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి



- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేసే సత్తా
- వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం
- పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం
- 80 కోట్ల మంది ప్రజలకు ఉచిత రేషన్‌తో లబ్ధి
- పీఎం స్వానిధి ద్వారా 78 లక్షల వీధి వ్యాపారులకు రుణాలు
- జన్ ధన్ ఖాతాలకు రూ.34 లక్షల కోట్లు బదిలీ
- ఏటా 11.8 కోట్ల రైతులకు కిసాన్ సమ్మాన్ యోజన
- యధాతథంగా పన్నుల చెల్లింపు విధానం
- లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్



వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ఆర్థిక విధానాలు ఉండబోతున్నాయని తెలిపారు. భారత్‌కు మాత్రమే ప్రత్యేకమైన 'డెమొక్రసీ, డెమొగ్రఫీ, డైవర్సిటీ' త్రయానికి దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేసే సత్తా ఉందన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గతంలో సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేది. కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభు త్వం దృష్టి సారించింది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం. గురువారం లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్ 2024ను ప్రవేశ పెడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయి. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కర ణలు ఫలితాలిస్తున్నాయి. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు.పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నాం. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ది పొందారు. రైతులకు కనీస మద్దతు ధరను ఎప్పటికప్పుడు పెంచుతున్నాం. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించారు. పీఎం స్వానిధి ద్వారా 78 లక్షల వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేశాం. మరో 2.3 లక్షల మందికి కొత్త రుణాలు ఇవ్వనున్నాం. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా జన్ ధన్ ఖాతాలకు రూ.34 లక్షల కోట్లు బదిలీ చేశాం. దీనివల్ల ప్రభుత్వానికి రూ.2.7లక్షల కోట్లు ఆదా అయ్యింది. స్కిల్ ఇండియా మిషన్ కింద 1.4 కోట్ల యువకులకు నైపుణ్య శిక్షణ అందించాం. పీఎం ముద్ర యోజన కింద రూ.22.5 లక్షల కోట్లు విలువ చేసే 43 కోట్ల రుణాలను మంజూరు చేశామని నిర్మల అన్నారు. వివరాలు 2లో..

### బడ్జెట్‌లో వివిధ శాఖలు..పథకాలకు కేటాయింపులు

- మౌలిక వసతుల రంగానికి రూ.11.11లక్షల కోట్లు
- రక్షణశాఖకు రూ.6.2లక్షల కోట్లు
- రైల్వేశాఖకు రూ.2.55లక్షల కోట్లు
- హోంశాఖకు రూ.2.03లక్షల కోట్లు
- వ్యవసాయం, రైతుల సంక్షేమానికి రూ.1.27లక్షల కోట్లు
- గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.1.77లక్షల కోట్లు
- ఉపరితల రవాణా, జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.2.78లక్షలకోట్లు
- ఆహారం, ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.2.13లక్షల కోట్లు
- రసాయనాలు, ఎరువుల కోసం రూ.1.68లక్షలకోట్లు
- కమ్యూనికేషన్ రంగానికి రూ.1.37లక్షలకోట్లు
- గ్రామీణ ఉపాధిహామీ పథకానికి రూ.86వేలకోట్లు
- ఆయుష్మాన్ భారత్ పథకానికి రూ.7500కోట్లు
- పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.6,200కోట్లు
- సెమీ కండక్టర్లు, డిస్‌ప్లే ఎకో వ్యవస్థల తయారీకి రూ.6,903కోట్లు
- సోలార్ విద్యుత్ గ్రిడ్‌కు రూ.8500కోట్లు
- గ్రీన్ హైడ్రోజన్‌కు రూ.600కోట్లు

## ఎమ్మెల్యేలు ఎవరూ సిఎంను కలవకండి

- అధికార పార్టీ ట్రాప్‌లో పడకండి
- పనులకోసం నియోజకవర్గాల్లోనే వినతి పత్రాలు ఇవ్వండి
- కాంగ్రెస్ కుమ్ములాటలతోనే పలచనవుతుంది
- పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలకు కెసిఆర్ దిశానిర్దేశం



హైదరాబాద్,ఫిబ్రవరి1 : రాజీలేని పోరాటాలతో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడు కుంటుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యానించారు. గురువారం సాయంత్రం బీఆర్ఎస్ ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశంచేశారు. అలాగే అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల్లో అనుసరిం చాల్సిన కార్యాచరణపై సూచనలు చేశారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపామని ఈ సందర్భంగా కేసీఆర్ తెలిపారు. తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపామని అన్నారు. బీఆర్ఎస్ రాజీలేని పోరాటాలతో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకుందని పునరుద్ఘాటించారు.ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మిగతా 2లో..

## ముగిసిన సర్పంచ్ పాలన



- రానున్న ప్రత్యేక అధికారుల పాలన

హైదరాబాద్,ఫిబ్రవరి1 : గ్రామ పంచాయతీల్లో మళ్లీ ప్రత్యేక అధికారుల పాలన రానుంది. నిన్నటితో ప్రస్తుత పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియనుండడంతో ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. నిన్నటితో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండడంతో రాష్ట్రం లోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించంది. దీంతో రేపు బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు అధికారులు. ఆయా మండలాలకు చెందిన ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజనీర్లు, ఇతర గెజిటెడ్ అధికారులను ప్రత్యేక అధికారులుగా ఉన్నతాధికారులు నియమించారు.సర్పంచ్‌ల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచా యతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. రికార్డులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక అధికారి, కార్యదర్శికి జాయింట్ చెక్ పవర్‌ను ప్రభుత్వం కల్పించింది. డిజిటల్ కీకి మిగతా 2లో..

## బియ్యం ధరలకు కళ్లెం వేస్తూ కేంద్రం కీలక నిర్ణయం

- 29 రూపాయలకే భారత్ రైస్ పేరిట కిలో బియ్యం



న్యూఢిల్లీ,ఫిబ్రవరి1 : బియ్యం ధరలకు కళ్లెం వేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇక, నేటి నుంచే మార్కెట్ లోకి బియ్యం వస్తుంది.. వీటికి భారత్ రైస్ గా కేంద్రం నామకరణం చేసింది. ఈ భారత్ రైస్ ను కిలో కేవలం 29 రూపాయలకే విక్రయించాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. దీని వల్ల సామన్య, మధ్య తరగతి ప్రజలకు నాణ్యత కలిగిన బియ్యం తక్కువ ధరకే మార్కెట్ లో లభించేలా మోడీ సర్కార్ చర్యలు తీసుకుంటుంది.అయితే, నేటి నుంచి భారత్ రైస్ మార్కెట్ లోకి వస్తుంది. ఈ తరణంలో ఈ బియ్యాన్ని ఎక్కువ ధరకు విక్రయించినా, బ్లాక్ మార్కెట్ కు తరలించేందుకు ట్రై చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఇటీవల బియ్యం ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం భారత్ రైస్ ను అందుబాటులోకి తీసుకు వస్తుంది.

## ప్రజానాడి




## ఇదే నాకు చివరి టర్మ్


- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను
- నేను, సిఎం రేవంత్ మిత్రులం..
- మీమిద్దరం కలిస్తే తప్పేంటి..!
- ఎమ్మెల్యే మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,ఫిబ్రవరి1 : సీఎం రేవంత్, నేను ఇద్దరం కలిస్తే తప్పేంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో మల్లా రెడ్డి మాట్లాడుతూ.. మళ్ళీ పోటీ చేయనని కీలక వ్యాఖ్యలు చేశారు. తాను.. రేవంత్ పాత మిత్రులమని, టీడీపీ వాళ్ళమని తెలిపారు. కీసర ఆలయం కార్యక్రమంకు పిలిచెందుకు సీఎం రేవంత్ ను కలుస్తాం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నీ కలిస్తే తప్పు ఎందుకు ? ఆయన రాష్ట్రానికి సీఎం కదా ? అన్నారు. త్వరలో గోవాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తా అని ప్రకటించారు. ఇప్పటికే గోవాలో హోటల్ కొన్నానని అన్నారు. హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారం స్లో అయ్యిందని తెలిపారు. మిగతా 2లో..

## తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి భూమి సమస్య

- బడ్జెట్ లో తెలంగాణకు 5071 కోట్ల కేటాయింపు
- కాజీపెట్ కొనసాగుతున్న వ్యాగన్ ఫ్యాక్టరీ పనులు
- రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో రైల్వే అభివృద్ధికి ముందుకు రావాలి
- బడ్జెట్ పై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి1 : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25కు సంబంధించిన మధ్యంతర బడ్జెను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే.. ఈ నేపథ్యంలో 2024 - 25 మధ్యంతర బడ్జెట్ పై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 2024 -25 బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు 9138 కోట్లు కేటాయింపు, 2024- 25 బడ్జెట్ లో తెలంగాణకు 5071 కోట్ల కేటాయింపు చేసినట్లు తెలిపారు. కాజీపెట్ రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ పనులు కొనసాగుతున్నాయని, ఎప్పుడు లేని విధంగా గత పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధి జరిగిందన్నారు. రైల్వే బ్రిడ్జి లు, కొత్త రైల్వే ట్రాక్ ల నిర్మాణం, ఎలక్ట్రిఫికేషన్ , ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరిగిందని ఆయన వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి ప్రధానంగా భూమీ సమస్య ఉందని, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్త శుద్ధి తో రైల్వే అభివృద్ధికి ముందుకు రావాలన్నారు అశ్విని వైష్ణవ్. అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం మాట్లాడుతూ.. సౌత్ సెంట్రల్ పరిధిలో జరిగిన ప్రమాదాల మీద విచారణ జరుగుతుందన్నారు. ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్ కంప్లీట్ అయ్యిందన్నారు. త్వరలో సనత్ నగర్ - మౌలాలి ఎంఎంటీఎస్ సర్వీస్ ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్ కి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని, ఇప్పటివరకు 50 శాతం నిధులు మాత్రమే వచ్చాయన్నారు. నిధుల ఆలస్యంగానే సెకండ్ ఫేజ్ లేట్ అయ్యిందని, చర్ల పల్లి రైల్వే టెర్మినల్ పనులు స్పీడ్ గా జరుగుతున్నాయన్నారు.

# వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి1 :** వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ఆర్థిక విధానాలు ఉండబోతున్నాయని తెలిపారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కర ణలు ఫలితాలిస్తున్నాయి. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నాం. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ది పొందారు. రైతులకు కనీస మద్దతు ధరను ఎప్పటికప్పుడు పెంచుతున్నాం. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించారు. పీఎం స్వానిధి ద్వారా 78 లక్షల వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేశాం. మరో 2.3 లక్షల మందికి కొత్త రుణాలు ఇవ్వనున్నాం. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా జన్ ధన్ ఖాతాలకు రూ.34 లక్షల కోట్లు బదిలీ చేశాం. దీనివల్ల ప్రభుత్వానికి రూ.2.7లక్షల కోట్లు ఆదా అయ్యింది. స్కిల్ ఇండియా మిషన్ కింద 1.4 కోట్ల యువకులకు నైపుణ్య శిక్షణ అందించాం. పీఎం ముద్ర యోజన కింద రూ.22.5 లక్షల కోట్లు విలువ చేసే 43 కోట్ల రుణాలను మంజూరు చేశామని నిర్మల అన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా ఏటా 11.8 కోట్ల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సాయం అందిస్తున్నాం. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోంది. జాతీయ విద్యా విధానం ద్వారా అనేక మార్పులు తీసుకొచ్చాం. 3000 ఐటీఐలు, ఏడు ఐఐటీలు, 16 ఐఐఐటీలు, 15 ఎయిమ్స్‌లు, 390 విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశాం. గత పదేళ్లలో ఉన్నత విద్యలో మహిళల నమోదు 28 శాతం పెరిగిందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను సంఘటితపర్చడానికి డిజిటల్ ఇండియా చాలా కీలకం. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడింది. మూలధన పెట్టుబడులకు 'గిఫ్ట్' ఒక ప్రధాన మార్గంగా అవతరించింది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. సామరస్యంతో కూడిన ప్రకృతి, ఆధునిక మౌలిక సదుపాయాలే వికసిత్ భారత్ విజన్. ఆశావహ జిల్లాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సాయం అందిస్తుంది. భారత వృద్ధి పథంలో తూర్పు భాగంలోని రాష్ట్రాలు కీలక పాత్ర పోషించేలా కృషి చేస్తాం' అని సీతారామన్ తన బ్జడెట్ ప్రసంగంలో వెల్లడించారు.2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే తమ లక్ష్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇటీవల భారత ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయి. 2014లో ప్రధాని మోదీ అధికారం చేపట్టినప్పుడు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించారు. అన్ని వర్గాలు, ప్రజలందరి సమ్మిళిత వృద్ధి, అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. 2047 నాటికి భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతాం.' అని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బ్జడెట్‌ను రూపొందించడం జరిగిందన్నారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ఆర్థిక మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయన్నారు. కరోనా సంక్షోభాన్ని దేశం అధిగమించిందని చెప్పారు. పాలనలో పారదర్శకత తీసుకువచ్చామన్నారు. చిన్న బ్జడెట్‌పై భారీగా అంచనాలు ఉన్నాయని, అన్నివర్గాల ప్రజల సంక్షేమమే బడ్జెట్ లక్ష్యం అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన నూతన సంస్కరణలతో కొత్త పారిశ్రామిక వేత్తలు పుట్టుకొచ్చారని అన్నారు. పదేళ్లలో ఇళ్ల నిర్మాణానికి ఎంతో కృషిచేశామని చెప్పారు నిర్మలా సీతారామన్. పదేళ్లలో దేశ ఆర్థికస్థితి ఉన్నతస్థాయికి చేరుకుందన్నారు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందని, సబ్ కా సాత్, సబ్ కా వికాస్ లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం సమ్మిళిత వృద్ధి ఆలోచనా విధానం గ్రామ స్థాయికి చేరి సక్సెస్ అయ్యిందన్నారు. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పారు. గతంలో సామాజిక న్యాయం అనేది రాజకీయ నినాదదంగా ఉండేదని, ఇప్పుడు తమ ప్రభుత్వంలో సామాజిక న్యాయం అనేది పనితీరుగా మారిందన్నారు. పేద మహిళ, యువత, అన్నదాతల ఆశలు, ఆకాంక్షలు, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామని చెప్పుకొచ్చారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. పేదరికం నుంచి పదేళ్లలో 25 కోట్ల మందికి విముక్తి కల్పించామన్నారు. జన్‌ధన్ అకౌంట్ల ద్వారా రూ. 34 లక్షల కోట్లు అందించామన్నారు.అన్నదాతల సంక్షేమం కోసం 11.8 కోట్ల మందికి ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. 4 కోట్ల మంది రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. 2014లో దేశం ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న పరిస్థితుల నుంచి ఇప్పుడు ఎంతో మార్పు వచ్చిందన్నారు. సంస్కరణల పథంలో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందన్నారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్' అనే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విజన్ గురించి వివరించారు. గత 10 సంవత్సరాలుగా పరివర్తన కాలం వచ్చిందని, భారత ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా పురోగమిస్తోందని అన్నారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. ఇటీవలి కాలంలో భారత ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పులు కనిపిస్తున్నాయని మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. 2014లో ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక ఎన్నో సవాళ్లు ఎదుర య్యాయి. ఆర్థిక వ్యవస్థ పటిష్టం కావడానికి, ఉపాధి పొందేందుకు వీలుగా ప్రజల ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించారు. సమ్మిళిత అభివృద్ధిపైనే ప్రభుత్వం దృష్టి సారించి, అన్ని వర్గాలకు, ప్రజలందరికీ అభివృద్ధి అనే చర్చ జరుగుతోంది. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామన్నారు ఆర్థిక మంత్రి. 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేయడం లో మోదీ ప్రభుత్వం విజయవంతమైందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రభుత్వం సమ్మిళిత అభివృద్ధిపై దృష్టి సారించింది. పేదలు, మహిళలు, యువత, రైతుల సాధికారతపై మోదీ సర్కార్ దృష్టి పెడుతోందన్నారు. 4 కోట్ల మంది రైతులకు ఫసల్ ఇన్సూరెన్స్ స్కీమ్ ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. 78 లక్షల మంది విక్రేతలకు పీఎం స్వానిధి పథకం కింద సహాయం అందించడం జరిగిందన్నారు. జన్ ధన్ ద్వారా నేరుగా రూ.34 లక్షల కోట్ల నగదు బదిలీ అయిందన్నారు నిర్మలా సీతారామన్. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 11.8 కోట్ల మంది రైతులకు ప్రభుత్వ సహాయం అందించామని, కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామని ఆర్థిక మంత్రి తెలిపారు. దేశంలోని అన్నదాత ఈ పథకం ద్వారా లబ్ది పొందుతున్నారు. ప్రధానమంత్రి ఫసల్ యోజన ప్రయోజనం 4 కోట్ల మంది రైతులకు అందించడం జరుగుతుంది. 300 యూనివర్సిటీలు స్థాపించి మూడో వంతు మహిళలకు రిజర్వేషన్ కల్పిం చామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దేశ ప్రజలు భవిష్యత్తు వైపు చూస్తున్నారని నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ సర్కార్ పట్ల ఆశాజనకంగా ఉన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ముందుకు సాగుతున్నాం. ఆర్థిక వ్యవస్థలో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రతి ఇంటికి నీరు, అందరికీ విద్యుత్, గ్యాస్, ఆర్థిక సేవలు, బ్యాంకు ఖాతాలు తెరిపిం చేందుకు మా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆహార ధాన్యాల సమస్యలను పరిష్కరించామని, 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు అందిం చామని ఆర్థిక మంత్రి తెలిపారు. ప్రాథమిక అవసరాలు నెరవేరాయి. దీని కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆదాయం పెరిగింది. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది, ప్రజలకు సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

## మధ్యంతర బడ్జెట్‌కు కేబినేట్ ఆమోదం

## లోక్‌సభలో ప్రవేశానికి ముందుమంత్రి వర్గం భేటీ

కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమై మధ్యంతర బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు కేంద్రమంత్రులు హాజరయ్యారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. ఈ ఏడాది ఏప్రిల్, మే మధ్య పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. బ్జడెట్‌కు ముందు నిర్మలా సీతారామన్ రాష్ట్రపతిని కలిశారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రికి స్వీటు తినిపించారు. అనంతరం అక్కడి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు చేరుకొని కేబినెట్ సమావేశంలో పాల్గొన్నారు. బడ్జెట్ నేపథ్యంలో పత్రులు పార్లమెంట్‌కు చేరుకున్నారు. మధ్యంతర బ్జడెట్ సందర్భంగా ఐఎంసీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ సమీర్ సోమయ్య మాట్లాడుతూ మధ్యంతర బ్జడెట్‌కు కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. దేశంలో యువ జనాభా ఎక్కువగా ఉందని.. వారికి నైపుణ్యం అవసరమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ 6.5శాతం అంతకంటే వేగంగా వృద్ధి చెందేందుకు రక్షణ, అంతరిక్షం, వ్యవసాయ రంగాల్లో స్టార్టప్‌లను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మాజీ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ ఆఫ్ ఇండియా కేవీ సుబ్రమణియన్ మాట్లాడుతూ ఎన్నికల తర్వాత పూర్తి బ్జడెట్‌ను జూన్, జూలైలో తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రస్తుత మధ్యంతర బ్జడెట్‌లో ఎక్కువ కేటాయింపులు ఉండకపోవచ్చన్నారు. ఆర్థిక వ్యవస్థ చాలా మంచి స్థితిలో ఉందని, 7.3 శాతం వేగంతో వృద్ధి చెందుతుందన్నారు.

## మొరార్జీ దేశాయ్ రికార్డు సమం చేసిన సీతరామన్

## వరుసగా ఆరోసారి బడ్జెట్ ప్రతిపాదించిన నిర్మల



లోక్ సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టిన కేంద్ర అర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అరుదైన రికార్డు సృష్టించారు. పార్లమెంట్ లో ఆమె బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది ఆరోసారి కావడం విశేషం. 2019 జూలై నుండి ఐదుసార్లు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆమె ఈ సారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. దీంతో గతంలో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ తరువాత వరుసగా ఆరోసారి బడ్జెట్ ప్రవేశ పెట్టిన అర్థిక శాఖ మంత్రిగా ఆమె అరుదైన ఘనత సాధించారు. మొరార్జీ దేశాయ్ ఆర్థిక మంత్రిగా 1959-1964 మధ్య ఐదు వార్షిక బ్జడెట్‌లు, ఒక మధ్యంతర బ్జడెట్‌ను సమర్పించారు. ఆయన గరిష్టంగా లోక్‌సభలో పది సార్లు బ్జడెట్ సమర్పించారు. ఇక లోక్‌సభలో మన్మోహన్ సింగ్, అరుణ్ జైట్లీ, చిదంబరం, యశ్వంత్ సిన్హాలు ఐదు సార్లు బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందిరా గాంధీ తరువాత పార్లమెంట్ లో బ్జడెట్ ప్రవేశ పెట్టిన రెండో మహిళా నిర్మలా సీతారామన్ కావడం విశేషం. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతలు స్వీకరించారు. 2014-15 నుండి 2018-19 వరకు వరుసగా ఐదు బ్జడెట్‌లను సమర్పించారు. 2019 ఫిబ్రవరి 1న పీయూష్ గోయల్ 2019-20 మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. దేశంలో సార్వత్రిక ఎన్నికల సమయంలో మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెడతారు. జూన్‌లో ఏర్పడే అవకాశం ఉన్న కొత్త ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించిన తుది బడ్జెట్‌ను జులైలో ప్రవేశపెట్టనుంది.

## బడ్జెట్‌కు ముందు కేంద్రం కీలక ప్రకటన

## మొబైల్ విడిభాగాల దిగుమతి సుంకం తగ్గింపు

మధ్యంతర బడ్జెట్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో ఉపయోగించి భాగాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించింది. మొబైల్ విడిభాగాలపై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. సిమ్ సాకెట్లు, మెటల్ భాగాలు, సెల్యులార్ మాడ్యూల్స్, ఇతర మెకానికల్ వస్తువులపై దిగుమతి సుంకాన్ని ఇప్పుడు 5 శాతం తగ్గించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. మిడిల్ కవర్, మెయిన్ లెన్స్, బ్యాక్ కవర్, జీఎస్ఎం యాంటెన్నా, పీయూ కేస్, సీలింగ్ గాస్కెట్, సిమ్ సాకెట్, స్క్రూలు, ఇతర ఎ÷-లాస్టిక్, మెటల్ మెటీరియల్‌లపై కూడా దిగుమతి సుంకాన్ని తగ్గించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో భారతదేశంలో ఫోన్‌లను ఉత్పత్తి చేసే కంపెనీలకు మరింత ఊరట కలుగనుండగా.. దిగుమతి సుంకం తగ్గడంతో మొబైల్‌ఫోన్ల ధరలు సైతం తగ్గే అవకాశాలున్నాయి. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (ఉ÷ఖీఎ) నివేదికలో స్మార్ట్‌ఫోన్‌ల తయారీకి ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ భాగాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించవచ్చని పేర్కొంది. ప్రభుత్వం చర్య మేక్ ఇన్ ఇండియాను ఊతమిస్తుందని చెప్పింది.

## పర్యాటకంగా లక్షద్వీప్ అభివృద్ధి

## ఆధ్యాత్మిక టూరిజాన్ని ప్రోత్సహిస్తాం

## టూరిజం ప్రోత్సాహానికి వడ్డీలేని రుణాలు

## బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ వెల్లడి

దేశంలో టూరిజాన్ని ప్రమోట్ చేసేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టిందని కేంద్ర అర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పార్లమెంట్‌లో గురువారం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 2024-25పై మంత్రి ప్రసంగించారు. దేశంలో ఆధ్యాత్మిక టూరిజాన్ని ప్రోత్సహిస్తామని ఆమె తెలిపారు. టూరిస్ట్ హబ్ గా లక్షద్వీప్ ను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. లక్షద్వీప్ లో టూరిజం అభివృద్ధికి మౌళిక వసతులను పెంచనున్నట్లు చెప్పారామె. టూరిజాన్ని ప్రమోట్ చేసేందుకు వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు అయోధ్యలో రామాలయం నిర్మించామని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారతే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. దేశంలో పౌర విమానయాన రంగాన్ని బలోపేతం చేస్తున్నామని..1000 కొత్త విమానాల కొనుగోలుకు ఆర్డర్ కూడా ఇచ్చామని ఆమె తెలిపారు. దేశంలోని మరిన్ని నగరాలకు మెట్రో రైళ్లు విస్తరించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా కొత్త రోడ్, రైలు కారిడార్లను అందుబాటులోకి తెస్తున్నామని.. మూడు మేజర్ రైల్వే కారిడార్ల నిర్మాణం జరుగుతుందని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశంలో పర్యాటక కేంద్రాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పర్యాటక రంగంలో అభివృద్ధి వేగవంతమవుతోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ క్రమంలో టైర్ 2, టైర్ 3 నగరాలను విమానాల ద్వారా అనుసంధానిస్తామని తెలిపారు. దీంతోపాటు లక్షద్వీప్‌లో కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవుతాయని అన్నారు. భారతీయులు పెద్ద సంఖ్యలో వెళ్లే ద్వీప సమూహ దేశమైన మాల్దీవులతో దౌత్యపరమైన వివాదం తర్వాత చాలా మంది భారతీయులు లక్షద్వీప్‌ను ప్రత్యామ్నాయ గమ్యస్థానంగా చూస్తున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలో పర్యాటక రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తామన్నారు. 75 వేల కోట్ల రుణాన్ని వడ్డీ లేకుండా ఇచ్చామని ప్రస్తావించారు. ఎఫ్‌డీఐలు కూడా 2014 నుంచి 2023కి భారీగా పెరిగాయని అన్నారు.జీవ ఇంధనం కోసం ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రజా రవాణా కోసం ఈ వాహనాలు అందుబాటులోకి వస్తాయి. రైల్వే సముద్ర మార్గాన్ని అనుసంధానం చేయడంపై కూడా దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో పూర్తి బ్జడెట్ జూలైలో వస్తుందని నిర్మల వెల్లడించారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను ఇందులో ప్రదర్శించనున్నారు. మౌలిక సదుపాయాల కోసం 11 శాతం ఎక్కువగా ఖర్చు చేయనున్నారు. జనాభా పెరుగుదలపై కమిటీని ఏర్పాటు చేశారు.



## వృద్ధిని పెంచడానికి ఆర్థిక సంస్కరణలు అమలు

- బడ్జెట్ పరిమాణం మొత్తం రూ.47.66లక్షల కోట్లు
- వివిధ మార్గాల ద్వారా ఆదాయం రూ.30.80లక్షల కోట్లు
- మౌలిక వసతుల రంగానికి రూ.11.11లక్షల కోట్లు
- రక్షణశాఖకు రూ.6.2లక్షల కోట్లు
- ల్గ÷ల్వేశాఖకు రూ.2.55లక్షల కోట్లు
- హోంశాఖకు రూ.2.03లక్షల కోట్లు
- వ్యవసాయం, రైతుల సంక్షేమానికి రూ.1.27లక్షల కోట్లు
- గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.1.77లక్షల కోట్లు

భారతదేశ వృద్ధిని పెంచడానికి ఆర్థిక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. కేంద్ర బడ్జెట్‌లో వివిధ శాఖలు, పథకాలకు కేటాయింపులు చేశారు. బడ్జెట్ పరిమాణం మొత్తం రూ.47.66లక్షల కోట్లు కాగా.. వివిధ మార్గాల ద్వారా ఆదాయం రూ.30.80లక్షల కోట్లుగా అంచనా వేశారు. బ్జడెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ గత 10 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఇది సాధ్యమైందన్నారు. ఆయన ప్రధాని అయ్యాక ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయని.. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ మంత్రంతో ప్రభుత్వం సవాళ్లను ఎదుర్కొన్నట్లు వివరించారు.



# పన్నుల విధానం యధాతథం

ఉద్యోగుల పన్నుల విధానంలో ఎలాంటి మార్పు లేకుండానే నిర్మలా సీతారమన్ తన మధ్యంతర బడ్జెట్ ప్రతిపాదనలను ప్రతిపాదించారు. అసలు పన్ను విధానంలోనే ఎలాంటి మార్పులు చేయలేదు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్. గత ఏడాది ఉన్న విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. దిగుమతి, ఎగుమతి సుంకాల్లోనూ మార్పు లేదు.. ఉద్యోగులు, వ్యాపారులు కట్టే ఆదాయ పన్ను స్లాబుల్లోనూ మార్పు లేదు.. యధాతథంగా కొనసాగనున్నట్లు ప్రకటించారు. గత బడ్జెట్లో ప్రకటించిన విధంగా స్టాండర్డ్ డిడక్షన్ అనేది 50 వేలు నుంచి 75 వేల రూపాయలకు పెంపు 2024 మార్చి నుంచి అమల్లోకి వస్తుందని.. కొత్తగా స్లాబ్ రేట్లను మార్చటం లేదని వెల్లడించారామె. ప్రస్తుతం ఉన్న పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు చేయటం లేదని వెల్లడించారామె. అయినా కూడా ప్రత్యక్ష పన్నులు మూడు రెట్లు పెరిగాయని.. ఇందుకు పన్ను చెల్లింపుదారులకు అభినందలు తెలిపారామె. కార్పొరేట్ ట్యాక్స్ 30 నుంచి 22 శాతానికి తగ్గింపు అనేది గత బ్జడెట్ లో తీసుకున్న నిర్ణయం అని.. అది అమల్లోకి వస్తుందని.. కొత్తగా కార్పొరేట్ ట్యాక్సుల్లో మార్పులు చేయటం లేదని స్పష్టం చేశారామె.ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు లేవని ఖరాఖండిగా స్పష్టం చేశారు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్. ఎన్నికల ముందు తాత్కాలిక బడ్జెట్ కావడంతో ఆర్థిక మంత్రి కొత్త ప్రతిపాదనలు చేయకుండా శాఖలవారీ కేటాయింపులకే పరిమితమయ్యారు.

## మధ్యతరగతి ఇళ్ల కోసం హౌజింగ్ స్కీమ్

## రాబోయే ఐదేళ్లలో 2కోట్ల ఇళ్ల నిర్మాణం

## కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

మధ్య తరగతికి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. అర్హులైన వారికి ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణం కోసం హౌసింగ్ స్కీమ్ తీసుకొస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బస్తీలు, అద్దె ఇళ్లలో ఉండేవారి సొంతింటి కలను నిజం చేస్తామని తన ప్రసంగంలో పేర్కొన్నారు. అలాగే, పీఎం ఆవాస్ యోజన కింద రాబోయే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. సొంతింటి నిర్మాణం కోసం తీసుకొచ్చిన 'పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్' కరోనా కాలంలోనూ కొనసాగిందని నిర్మలా సీతారామన్ చెప్పారు. 3 కోట్ల ఇళ్ల నిర్మాణం లక్ష్యాన్ని త్వరలో చేరుకోను న్నామని చెప్పారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని రాబోయే ఐదేళ్లు ఈ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మొత్తం 2 కోట్ల ఇళ్లను నిర్మించనున్నట్లు వివరించారు. విద్యుత్ బిల్లుల నుంచి సామాన్య ప్రజలకు విముక్తి కలిగించేలా బ్జడెట్‌లో నూతన పథకాన్ని ఆర్థికమంత్రి ప్రకటించారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు సరికొత్త రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీమ్‌ను తీసుకురానున్నట్లు తెలిపారు. దీనివల్ల గృహ విని యోగదారులకు ఏటా రూ. 15వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా అవు తుందని తెలిపారు. ఈ పథకం గురించి అయోధ్య రామమందిర ప్రారం భోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే.

## బడ్జెట్ రోజు ప్రత్యేక చీరలో నిర్మలాసీతారామన్

## తమిళనాడు చేనేత రామాబ్లూ ధరించిన ఆర్థికమంత్రి

బడ్జెట్ ప్రకటించే రోజు దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయంలో ప్రతి ఏడాది ఈ ప్రత్యేకమైన రోజున ఆమె ధరించే చీరలపైనా అందరి దృష్టి ఉంటుంది. గురువారం నిర్మలా సీతారామనర్ బడ్జెట్ ట్యాబ్ పట్టుకొని నీలంరంగు చీరలో కనిపించారు. ఈ టస్సర్ పట్టు చేనేత చీర.. గోధుమ రంగులో బెంగాలీ సంస్కృతిని ప్రతిబింబించే ఎంబ్రాయిడరీతో మెరిసిపోయింది. ఈ నీలివర్ణాన్ని తమిళనాడులో 'రామా బ్లూ' అని పిలుస్తారు. ఇటీవల అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠకు సంకేతంగా ఆమె ఈ రంగు చీరను ధరించారు. మొత్తంగా అటు బెంగాల్, ఇటు తమిళనాడు సంప్రదాయాలను కలగలిపిన చీరతో ఆమె మరోసారి ప్రత్యేకత చాటుకున్నారు. ఆమె 2019లో ఆర్థికమంత్రిగా బాధ్యతలు తీసుకున్న దగ్గరి నుంచి ఈ రోజు వరకు చేనేత చీరే ధరిస్తున్నారు. వాటిపై తన ప్రేమను ఓ సందర్భంలో ప్రస్తావించారు కూడా. 'సిల్క్, కాటన్ ఏదైనా కానీ.. ఒడిశా చేనేత చీరలు నాకిష్టమైన వాటిలో ఒకటి. వాటి రంగు, నేత పని, ఆకృతి బాగుంటాయి' అని వెల్లడించారు. 2023లో బ్రౌన్ రంగులో టెంపుల్ బోర్డర్‌లో ఉన్న ప్రకాశవంతమైన ఎరుపు చీరతో కనిపించారు. 2022లో మెరూన్ రంగు చీరను ధరించారు. ఇది కూడా ఒడిశాకు చెందిన చేనేత చీరే. ఆ రంగు దుస్తుల్లో ఆమె చాలా సాదాసీదాగా కనిపించారు. ఇది ఆమె నిరాడంబరతకు నిదర్శమని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. 2021లో ఎరుపు-గోధుమ రంగు కలగ లిసిన భూదాన్ పోచంపల్లి చీరలో కనిపించారు. తెలంగాణకు చెందిన ఈ పోచంపల్లిని సిల్క్ సిటీ ఆఫ్ ఇండియాగా పిలుస్తారు. 2020లో నీలం రంగు అంచులో పసుపుపచ్చ-బంగారు వర్ణంలో ఉన్న చీర కట్టులో మెరిశారు. ఈ రంగు శ్రేయస్సు, సమృద్ధిని సూచిస్తుంది. అలాగే 'ఆస్పిరేషనల్ ఇండియా' థీమ్‌కు అనుగుణంగా దీనిని ధరించారు. 2019లో మంగళగిరి గులాబీ రంగు చీర కట్టుకున్నారు. ఆ సమయంలో బ్జడెట్ పత్రాలు తెచ్చే సూట్‌కేస్ స్థానంలో బహీ ఖాతాతో మీడియా ముందుకువచ్చారు.

## ఆదాయపన్ను విధానం యధాతథం

## పన్నుల స్లాబుల్లో కనిపించని మార్పులు

## రూ.7 లక్షల ఆదాయం వరకూ మినహాయింపు

ఆదాయ పన్ను వర్గాలకు నిర్మలా సీతారామన్ తాత్కాలిక బడ్జెట్‌లో ఉపశమనం కలిగించే ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు లేవని తెలిపారు. గత ఏడాది ప్రతిపాదించిన కొత్త పన్ను విధానమే ఈసారి కూడా కొనసాగుతుందని, రూ.7 లక్షల వరకూ ఎలాంటి పన్ను భారం ఉండదని చెప్పారు. ప్రత్యక్ష, పరోక్ష, దిగుమతి సుంకాలకు పాత పన్ను విధానమే కొనసాగుతుందని తెలిపారు. గత పదేళ్లుగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లు మూడు రెట్లు పెరిగింది. రిటర్న్ 2.4 రెట్లు పెరిగాయి. పన్ను చెల్లింపుదారుల వాటాను దేశ సంక్షేమం, ప్రజల సంక్షేమానికి తెలివిగా ఖర్చుచేస్తామని వారికి హామీ ఇస్తున్నాను. పన్ను చెల్లింపుదారులు ఇస్తున్న సపోర్ట్‌కు అభినందిస్తున్నాను. ప్రభుత్వం పన్ను రేట్లను హేతుబద్ధం చేసింది. కొత్త పన్నుల పథకం కింద, రూ.7 లక్షల ఆదాయం వరకూ ఎలాంటి పన్ను ఉండదు. ఇందుకు ఎలాంటి పొదుపు, పెట్టుబడులతో పని ఉండదు. అంతకు మించి ఆదాయం కలిగిన వారికి శ్లాబుల ప్రకారం పన్ను వర్తిస్తుంది. గత ఏడాది ప్రతిపాదితపాత పన్ను విధనంలో ఆదాయ పరిమితి రూ.2.50,000 గానే ఉంటుంది. పాత పన్ను విధానంలోనూ పన్ను వర్తించే ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్నప్పుడు ఎలాంటి భారం ఉండదు. ప్రస్తుతం ఉన్న దేశవాళి కంపెనీల కార్పొరేట్ టాక్స్ రేటు 30 శాతం నుంచి 22 శాతం తగ్గించాం. నిర్దిష్టమైన కొత్త మ్యాన్యుఫ్యాక్టరింగ్ కంపెనీలకు పన్ను రేటు 15 శాతం చేశాం' అని నిర్మలా సీతారామన్ తెలిపారు.



# గంటలోపే ముగిసిన బడ్జెట్ ప్రసంగం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన చివరి బడ్జెట్ ప్రసంగాన్ని కేవలం గంటలోపే ముగించారు.మోదీ ప్రభుత్వ చివరి బడ్జెట్‌ను గురువారం లోక్ సభలో ప్రవేశపెట్టారు. 58నిమిషాలపాటు బడ్జెట్ ప్రసంగం కొనసాగించారు. ఇంతవరకూ ఆమె ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లతో పోల్చుకుంటే అత్యంత తక్కువ సమయంలో బ్జడెట్ ప్రసంగం ముగించడం ఇదే ప్రథమం.నిర్మలా సీతారామన్ గత ప్రసంగాలను పరిశీలిస్తే, 2019 లో 137 నిమిషాల పాటు ఆమె బడ్జెట్ ప్రసంగం సాగించారు. 2020లో 162 నిమిషాల పాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. 2021లో 110 నిమిషాలు, 2022లో 92 నిమిషాలు ప్రసంగిం చారు. 2023లో 87 నిమిషాల పాటు ఆమె ప్రసంగం సాగింది. ఈసారి తాత్కాలిక బడ్జెట్ కావడం తో 58 నిమిషాలతో ప్రసంగం ముగిసింది. 2019 జూలై నుంచి ఐదు సార్లు పూర్తి బ్జడెట్‌ను నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో గత ఆర్థిక మంత్రులు మన్మోహన్ సింగ్, అరుణ్ జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్ సిన్హాల రికార్డులను ఆమె అధిగమించారు.

# లారీ దూసుకెళ్లి విద్యార్థినికి తీవ్ర గాయాలు

### ఆస్పత్రికి తరలించి చికిత్స

మేడ్చల్ మల్కాజిగిరి,ఫిబ్రవరి1 : హైదరాబాద్ శివారు పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యంనంపేట రోడ్డుపై అతివేగంగా వెళుతున్న లారీ హర్షిత అనే విద్యార్థి(20 ) కాళ్లపై నుంచి దూసుకెళ్లింది. యువతి ఎగ్జామ్ రాసి తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాయపడిన విద్యార్థిని శ్రీకర ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సమాచారంఅందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని..కేసునమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. శ్రీనిధికళాశాలలోబీటెక్‌సెకండ్ ఇయర్ చదువుతున్న హర్షితగా పోలీసులు గుర్తించారు.

# నిరాశజనకంగా మోడీ బడ్జెట్

### విపక్షాల విమర్శల తూటాలు

### ఉద్యోగాల కల్పన, ద్రవ్యోల్బణంపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1 : మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. వారి 'మిత్ర కాల్'బడ్జెట్లో ఉద్యోగాలను సృష్టించే ఆలోచన లేదని, అలాగే ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవటానికి ఎటువంటి ప్రణాళిక లేదని ఎద్దేవా చేశారు. దేశ భవిష్యత్తును నిర్మించడానికి కేంద్రానికి ఎలాంటి రోడ్‌మ్యాప్ లేదని అన్నారు. మరోవైపు దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను పరిష్కరించేందుకు ఈ కేంద్ర బడ్జెట్ ప్రయత్నించడం లేదని కేరళ సీఎం పినరయి విజయన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మధ్యంతర బడ్జెట్‌పై డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ మాట్లాడుతూ బడ్జెట్లో ప్రత్యేకత ఏమీ లేదన్నారు. మెరుగైన భవిష్యత్తుకు సంబంధించి ఎలాంటి వాగ్దానాలు కనిపించడం లేదని చెప్పారు. వచ్చే పూర్తి బ్జడెట్ కోసం తాము ఎదురుచూస్తున్నామని, అయితే దానిని భారత్ కూటమి సమర్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మధ్యంతర బ్జడెట్‌ను డల్‌గా అభివర్ణించారు. ఈ బడ్జెట్ ఎక్కడుంది ఏదైనా ప్రకటన ఉందా అని ప్రశ్నించారు. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ఏదైనా ప్రయత్నం ఉందా? విదేశీ రుణాన్ని తగ్గించుకోవడానికి ఏమైనా పరిష్కారాలు ఉన్నాయా? ద్రవ్యోల్బణం, నిరుద్యోగం గురించి ఏమైనా చెప్పారా? అంటూ ప్రశ్నలు సంధించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, రైతులు, కార్మికులు, యువత, మహిళల గురించి మాట్లాడే భారత బ్జడెట్ వస్తుందని తాము తీసుకొస్తామని హామీ ఇచ్చారు. మధ్యంతర బడ్జెట్ పేరుతో మోదీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల లాలీపాప్ ఇచ్చిందని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి నీలభ్ శుక్లా మండిపడ్డారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యల పరిష్కారానికి ఎలాంటి బ్లూప్రింట్‌ను సమర్పించని ఈ బడ్జెట్ ప్రభుత్వానికి ఇష్టమైన పారిశ్రామికవేత్తలకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

# ఎమ్మెల్యేలు ఎవరూ సిఎంను కలవకండి

(మొదటిపేజీ తరువాయి)

చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు కేసీఆర్ సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నామని ఎవరు అద్దైర్యపడొద్దు. అందరూ దైర్యంగా ఉండండని అన్నారు. ప్రతిపక్షంలో ఉండటం తప్పేమీ కాదు. కాంగ్రెస్ నేతల ట్రాప్‌లో ఎమ్మెల్యేలెవరూ పడొద్దు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా ఉండాలి. మంచి ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రిని కలిసినా మీ వ్యక్తిత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రజల సమక్షంలోనే మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వండి. మనకు తొందరలేదు కాంగ్రెస్‌కు తగిన సమయం ఇద్దాం. మనం పెద్దగా తిట్టాల్సిన అవసరం లేదు. వాళ్లను వాళ్లే తిట్టుకుంటారు.. వాళ్లే దిగిపోతారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం అంత సులువు కాదు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు సిద్ధం కావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకపోతే ప్రజల నుంచే వ్యతిరేకత వస్తుంది. ప్రజలు బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం కోల్పోలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కు దక్కుతుందని ఎమ్మెల్యేలు, ఎంపీలకు కేసీఆర్ సూచించారు.కృష్ణా నదిపై ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధికి ఇవ్వాలన్న కేంద్రం ప్రతిపాదనలపై కేసీఆర్.. ఎంపీలతో చర్చించారు. ఈ విషయంపై ఢిల్లీలో ఆందోళన చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో పార్లమెంట్ ఉభయ సభల్లో ఎంపీలు ఆందోళన చేపట్టాలని కేసీఆర్ సూచించారు. అలాగే కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని కలిసి పార్టీ తరపున నిరసన తెలియజేసి, వినతి ఇవ్వాలని ఎంపీలకు చెప్పారు. రేపు(శుక్రవారం) పార్లమెంట్ సమావేశాల సమయంలో ఆందోళనకు ఎంపీలు సిద్ధం కావాలని కేసీఆర్ ఆదేశించారు.

# ముగిసిన సర్పంచ్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

అధీకృత అధికారిగా ప్రత్యేక అధికారి ఉంటారు. డిజిటల్ కీ, చెక్కులు, రికార్డుల్లో ఏదైనా సమస్య తలెత్తితే కార్యదర్శిదే బాధ్యత అని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఇక నుంచి గ్రామ పంచాయతీల్లో వచ్చే నిధులన్నింటికీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. సమైక్య రాష్ట్రంలో కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్న 2011 నుంచి 2013 వరకు, 2018లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో హనుమకొండ జిల్లాలో 208, వరంగల్ జిల్లాలో 323, మహబూబాబాద్ జిల్లాలో 461, జనగామ జిల్లాలో 281, ములుగు జిల్లాలో 173, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 241 పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అధికారులను గుర్తించి మండలాల వారీగా జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. తహసీల్దార్, ఎంపీడీఓ, పీఆర్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ ఏఈలు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఎంపీఓలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. వీరికి రేపు గ్రామ పంచాయతీల పరిపాలన బాధ్యతలు అప్పగించనున్నారు.

# ఇదే నాకు చివరి టర్మ్

(మొదటిపేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం వాళ్లకు షాక్.. మేము రాకపోవడం మాకు షాక్ అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా మేడ్చల్ బీఆర్ ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన మల్లారెడ్డి.. ఇదే తనకు చివరి టర్మ్ . ప్రస్తుతం 71 ఏళ్ల వయసున్న మల్లారెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించిన విషయం తెలిసిందే. తనకు అండగా నిలిచిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఒకసారి ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని.. కార్యకర్తలు, ప్రజల అండదండలతో ఒకసారి మంత్రిని కూడా చేశానని మల్లారెడ్డి గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు 95 శాతం న్యాయం జరిగిందని మల్లారెడ్డి అన్నారు. భవిష్యత్తులో ప్రజాసేవ చేస్తానన్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన మల్లారెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గులాబీ కండువా కప్పుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. కేసీఆర్ కేబినెట్‌లో కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి వరుసగా రెండోసారి విజయం సాధించారు. ఇక ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

# ఇంద్రవెల్లి వేదికగా కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

- ఇంద్రవెల్లి వేదికగా కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం
- నేడు ఆదిలాబాద్ జిల్లాలో సిఎం రేవంత్ పర్యటన
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న మంత్రి సీతక్క



ఆదిలాబాద్,ఫిబ్రవరి1 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నుంచి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఇందుకోసం జిల్లాలో పర్యటించనున్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా జిల్లాలో పర్యటించనున్నారు. ముందుగా కేస్లాపూర్‌లో నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. తర్వాత ఇంద్రవెల్లిలో అమరవీరుల స్మృతి వనానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఇంద్రవెల్లిలో భారీ బహిరంగలో పాల్గొని ప్రసంగిస్తారు. ఇక్కడి నుంచే పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని సీఎం రేవంత్ రెడ్డి పూరించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరు కానున్నారు. ఇంద్రవెల్లి దళిత గిరిజన దండోరా సభ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు నాంది పలికిందని.. అందుకే సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మొదటి సభ కూడా మళ్ళీ అక్కడే నిర్వహిస్తున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి అమర వీరుల స్మృతి వననానికి సీఎం భూమి పూజ చేస్తారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇక్కడి అభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. లక్ష మందితో ఇంద్రవెల్లి సభ జరుగుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కాగా.. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ పలు కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. ఇంద్రవెల్లి నుంచే పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అప్పట్లో రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యాక 2021 ఆగస్టు 9న ఇంద్రవెల్లిలో దళిత గిరిజన దండోరా సభను నిర్వహించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే సెంటిమెంట్‌తో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ఇంద్రవెల్లి నుంచే ప్రారంభించాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఇంద్రవెల్లి బహిరంగ సభను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ పిలుపునిచ్చారు. మరోవైపు ఇంద్రవెల్లి బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

# ఎమ్మెల్యేగా కెసిఆర్ ప్రమాణస్వీకారం


### ప్రమాణం చేయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

### హాజరైన శ్రీధర్ బాబు తదితర బిఆర్ఎస్ నేతలు



హైదరాబాద్,ఫిబ్రవరి1 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం మధ్యాహ్నం 12:45 గంటలకు ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఛాంబర్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కేసీఆర్ చేత స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారానికి అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. గత ఎన్నికల్లో గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో కేసీఆర్ పోటీ చేశారు. అయితే కామారెడ్డిలో ఓడిపోయిన కేసీఆర్... గజ్వేల్‌లో విజయం సాధించారు. అయితే తుంటి ఎముక శస్త్ర చికిత్స కారణంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం ఆలస్యమైంది. ఈరోజు గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం చేశారు. మధ్యాహ్నం 12 తర్వాత అసెంబ్లీకి చేరుకున్న కేసీఆర్.. ముందుగా అసెంబ్లీలోని ఎల్ఓపీ కార్యాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆపై స్పీకర్ ఛాంబర్‌కు చేరుకుని ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. కేసీఆర్ ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు అందరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కూడా ప్రమాణస్వీకారంలో పాల్గొన్నారు. కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్వహించిన తొలి అసెంబ్లీ సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన వారు ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే తుంటి ఎముక ఫ్యాక్చర్ కారణంగా కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయలేదు. గతేడాది డిసెంబర్‌లో ఫాంహౌస్‌లోని బాత్రూమ్‌లో జారిపడిన కేసీఆర్‌కు తుంటి ఎముక విరిగింది. దీంతో ఆయనకు వైద్యులు తుంటి ఎముక శస్త్ర చికిత్స చేశారు. కొద్దిరోజుల పాటు చికిత్స అనంతరం కేసీఆర్ డిశ్చార్జ్ అయ్యారు. ఆ తరువాత ఇంటిలోనే మాజీ ముఖ్యమంత్రి విశ్రాంతి తీసుకున్నారు. తుంటి ఆపరేషన్ తర్వాత కేసీఆర్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు.

# కృష్ణా బోర్డు పరిధిలోకి ప్రాజెక్టుల ఆపరేషన్




### అంగీకరించిన ఉభయ తెలుగు రాష్ట్రాలు

హైదరాబాద్,ఫిబ్రవరి1 : కృష్ణా బోర్డు పరిధిలోకి ప్రాజెక్టుల ఆపరేషన్‌కు ఏపీ, తెలంగాణ అంగీకారం తెలిపాయి. హైదరాబాద్‌లో కృష్ణా రివర్ బోర్డు సమావేశం గురువారం జరిగింది. అనంతరం మీడియాతో ఏపీఈఎన్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ, బోర్డు పరిధిలో మొత్తం 15 కాంపోనెంట్స్‌లో 9 తెలంగాణ, 6 ఆంధ్రప్రదేశ్‌వి ఉన్నాయని, కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత పై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ కోసం ఇరు రాష్ట్రాల నుంచి స్టాప్ కేటాయింపు ఉంటుంది. వాటర్ కేటాయింపులపై త్రిసభ్య కమిటీ దే తుది నిర్ణయం. ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రోటోకాల్ త్రిసభ్య కమిటీ అప్పుడున్న పరిస్థితుల్లో తీసుకుంటారు. లెఫ్ట్ మెన్ కెనాల్ నుంచి రెండు టీఎంసీ, మార్చిలో రైట్ మెన్ కెనాల్ నుంచి మూడు టీఎంసీలు ఏపీకి విడుదలకు ఒప్పుకున్నారన్నారు. ఏప్రిల్ ఐదు టీఎంసీ లు ఏపీకి ముందుగానే ఉన్నాయి. ప్రాజెక్టుల ఆపరేషన్ కోసం తెలంగాణ ఒప్పుకుందని నారాయణరెడ్డి వెల్లడించారు. తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ మాట్లాడుతూ, ప్రాజెక్టుల ఆపరేటింగ్ అంతా కేఆర్ఎంబీకి ఇచ్చామని, పవర్ స్టేషన్స్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. నాగార్జున సాగర్ తెలంగాణ, శ్రీశైలం ఏపీ చూసుకుంటుంది. ప్రాజెక్టులన్నీ ఇక నుంచి బోర్డు పరిధిలో నడుస్తాయి. మా డిమాండ్స్ అన్ని కేంద్రానికి లేఖలు రాశాం. ఇంకా అక్కడ నుంచి నిర్ణయం రాలేదు' అని ఆయన పేర్కొన్నారు. 'నీటి వాటాల పంపకంపై త్రిసభ్య కమిటీనే నిర్ణయం తీసుకుంటుంది. ప్రాజెక్టుల వద్ద భద్రత అనేది పరిస్థితిని బట్టి బోర్డు కనుసన్నల్లో జరుగుతుంది. కేఆర్ఎంబీ పరిధిలో ఉన్న 15 హౌలటెట్స్ బోర్డు పరిధిలోకి వెళ్తాయి. ప్రాజెక్టులను పూర్తిగా అప్పగించలేదు ఆపరేషనల్, నీటి విడుదల బోర్డు చూసుకుంటుంది. సీఆర్‌పీఎఫ్ సైతం కృష్ణా బోర్డు పరిధిలోనే ఉంటాయి. నిర్వహణ కోసం స్టాప్ కేటాయింపు 40: 45 కావాలని అడుగుతున్నారు' అని మురళీధర్ వివరించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వహణకు కేబీఆర్ఎంబీకి అప్పగిస్తూ ఏపీ, తెలంగాణ అంగీకరించాయి. ఈఎన్సీ మురళీధర్ మాట్లాడుతూ ప్రాజెక్టుల ఆపరేటింగ్ అంతా కేఆర్ఎంబీకి ఇచ్చినట్లు తెలిపారు. పవర్ స్టేషన్స్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. నాగార్జున సాగర్ తెలంగాణ, శ్రీశైలం ఏపీ చూసుకుంటుందని, ప్రాజెక్టులన్నీ ఇక నుంచి బోర్డు పరిధిలో నడుస్తాయని తెలిపారు. ప్రాజెక్టుల వద్ద భద్రత అనేది పరిస్థితిని బట్టి బోర్డు కనుసన్నల్లో జరుగుతుందన్నారు. కేఈఆర్ఎంబీ పరిధిలో ఉన్న 15 ప్రాజెక్టులన్నీ బోర్డు పరిధిలోకి వెళ్తాయన్నారు. ప్రాజెక్టులను పూర్తిగా అప్పగించలేదని.. ఆపరేషనల్, నీటి విడుదల బోర్డు చూసుకుంటుందన్నారు. సీఆర్‌పీఎఫ్ సైతం కృష్ణా బోర్డు పరిధిలోనే ఉంటాయన్నారు. నిర్వహణ కోసం సిబ్బందిని కేటాయింపు 40: 45 కావాలని కోరుతున్నట్లు తెలిపారు.

# అసెంబ్లీలో సందడి వాతావరణం





### కెసిఆర్‌కు స్వాగతం పలికిన బిఆర్ఎస్ శ్రేణులు

హైదరాబాద్,ఫిబ్రవరి1 : అసెంబ్లీకి కేసీఆర్ వస్తున్నారన్న వార్త నేపథ్యంలో బీఆర్ఎస్, కేసీఆర్ అభిమానులు భారీ సంఖ్యలో అసెంబ్లీకి చేరుకున్నారు. దీంతో, అసెంబ్లీ వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కేసీఆర్ అసెంబ్లీ లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపడతారా లేదా అన్న అంశంపై బీఆర్ఎస్ వర్గాల్లో రకరకాల ప్రచారం జరిగింది. ఆయన మెదక్ ఎంపీ సీటుకు పోటీ చేస్తారని అనుకున్నారు. రేవంత్ రెడ్డి సభా నాయకుడిగా ఉంటే ప్రతిపక్ష నేతగా ఉండటానికి కేసీఆర్ ఇష్టపడరని అనుకున్నారు. కానీ ఇటీవలి కాలంలో కేసీఆర్ కుమారుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ .. కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ప్రకటించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తారని కాంగ్రెస్ సంగ తి తేలుస్తారని అన్నారు. ఫిబ్రవరిలో పులి బయటకు వస్తుందని కేటీఆర్ తెలిపారు. ఆయన చెప్పినట్టుగానే.. ఫిబ్రవరి ఒకటో తేదీనే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. తర్వాత కేటీఆర్ చెప్పినట్లుగా రాజకీయం మారుతుందా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. బాత్ రూంలో జారి పడటంతో తుంటికి గాయమైన కేసీఆర్ స్టిక్ సాయంతో మెల్లగా నడుస్తున్నారు. కొత్త బెంజ్ కారులో వచ్చిన ఆయనకు అసెంబ్లీ వద్ద పార్టీ నేతలు స్వాగతం పలికారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, పల్లా రాజేశ్వరరెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదనాచారి, మల్లారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

కేసీఆర్ తన చాంబర్ లో ప్రత్యేక పూజల అనంతరం స్పీకర్ కార్యాలయంకు వెళ్లి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ వెంటనే ప్రమాదవ శాత్తూ కేసీఆర్ గాయపడటంతో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయలేదు. తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స అనంతరం ఆరు నుంచి ఎనిమిది వారాలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఆయన రెండు నెలలుపాటు గజ్వేల్ వ్యవసాయ క్షేత్రంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇప్పుడిప్పుడు కర్ర సాయంతో వైద్యుల పర్యవేక్షణలో నెమ్మదిగా నడుస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో కేసీఆర్ అసెంబ్లీకి చేరుకొని, శాసనసభాపక్ష నేతగా ఆయనకు కేటాయించిన చాంబర్ లో కేసీఆర్ ముందుగా పూజలు చేశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ ఛాంబర్ కు చేరుకొని మధ్యాహ్నం 12.40 గంటలకు కేసీఆర్ శాసన సభ్యుడిగా ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు.

# బడ్జెట్ ఎంతగానో నచ్చింది : ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్,ఫిబ్రవరి1 : ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా సమకాలీన విషయాలపై తనదైన శైలిలో స్పందిస్తుంటారు. తాజాగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ పైనా ఆయన స్పందించారు. ఈ బడ్జెట్ తనకు ఎంతగానో నచ్చిందని అన్నారు. బడ్జెట్ లో కొన్ని కీలక అంశాలను ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రస్తావించారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంపై కూడా స్పందించారు. కుటుంబ బడ్జెట్ కు కేంద్ర బడ్జెట్ కు ఉన్న పోలీకను కూడా పేర్కొన్నారు.బడ్జెట్ అనగానే మనం అంచనాలు పెంచేసుకుంటున్నాం. బోలెడన్నీ పథకాలు, వాస్తవవిరుద్ధమైన ఆశలు పెట్టేసుకుంటున్నాం. బడ్జెట్ లో ప్రతిసారీ భారీ పథకాలు, విధానపరమైన మార్పులు ఉండాల్సిన అవసరం లేదు. ఇలాంటివి ఏడాది పొడుగూనా జరుగుతూ ఉండాలి. సాధారణ కుటుంబాల బడ్జెట్ లాగానే కేంద్ర బడ్జెట్ కూడా రాబడి పోబడులను సమీక్షించుకునేందుకు ఓ అవకాశం. ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన సమయం. మనకున్న వనరులకు లోబడి . జీవించేందుకు ప్రయత్నిస్తూ, భద్రమైన భవిష్యత్తుపై పెట్టుబడులు పెడితే మనపై మనకు నమ్మకం పెరుగుతుంది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు మనపై నమ్మకం పెరుగుతుంది. గత కొన్నేళ్లుగా నేను చెబుతున్నది ఇదే' అని ఆయన సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించారు. తక్కువ నిడివి గల బడ్జెట్ ప్రసంగాల్లో ఇదీ ఒకటని మెచ్చుకున్న ఆయన, బ్జడెట్ అంశాలను కాన్ఫిడెంట్‌గా వినిపించారంటూ ప్రశంసించారు. ఎన్నికల వేళ బ్జడెట్‌లో ప్రజాకర్షక పథకాలు లేకపోవడంపై కూడా ఆనంద్ మహీంద్రా హర్షం వ్యక్తం చేశారు. ద్రవ్యలోటు విషయంలో అనుకున్న లక్ష్యం కంటే మెరుగైన ఫలితం సాధించామని, ఆర్థిక వ్యవస్థ నిర్వహణ పరంగా చూస్తే ఇది మంచి విజయమని వ్యాఖ్యానించారు. టాక్సులు, డ్యూటీల్లో పెద్దగా మార్పులు లేకపోవడాన్ని ఆనంద్ మహీంద్రా ప్రస్తావించారు. వ్యాపారస్తులు ఇలాంటి సుస్థిరతనే కోరుకుంటారని చెప్పారు. పన్ను-జీడీపీ నిష్పత్తి అధికంగా ఉన్న విషయాన్ని కూడా ప్రస్తావించిన మహీంద్రా.. ఇది దేశానికి ఆర్థిక స్థిరత్వాన్ని ఇస్తుందని, అవసరమైన సందర్భాల్లో నిధుల లభ్యతను కూడా పెంచుతుందని అన్నారు. తన బడ్జెట్ గొప్పదనాన్ని కేంద్ర మంత్రి ఘనంగా చెప్పుకోవాలని కూడా ఆయన సూచించారు. ఇక బడ్జెట్‌లోని ప్లాన్స్‌ను మరింత నమ్మకంతో అమలు చేయచ్చంటూ ముగించారు.

# సుప్రీంను ఆశ్రయించిన సోరెన్

### ఇడి అక్రమ అరెస్ట్‌పై పిటిషన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1 : జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం లో పిటిషన్ దాఖలు చేశారు. హేమంత్ సోరెన్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. శుక్రవారం నాడు విచారిస్తామని హేమంత్ సోరెన్ లాయర్లు కపిల్ సిబాల్, అభిషేక్ మను సింఘ్వీలకు సమాచారం ఇచ్చింది. భూ ఆక్రమణ కేసులో ఈడీ అధికారులు హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు జార్ఖండ్ హైకోర్టులో హేమంత్ సోరెన్ పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ గురువారం ఉదయం 10.30 గంటలకు విచారించాల్సి ఉంది. అంతలోనే పిటిషన్‌ను హేమంత్ సోరెన్ వెనక్కి తీసుకున్నారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి హేమంత్ సోరెన్ న్యాయవాదులు తీసుకెళ్లారు. 'హేమంత్ సోరెన్ ఇలా అరెస్ట్ చేస్తే చేయడం సరి కాదు. సోరెన్ అరెస్ట్ విషయంలో ఈడీ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారు. రాత్రి 10 గంటలకు అరెస్ట్ అని మెమోలో చూపించారు.

# బలిపశువుగా హేమంత్ సోరేన్ !

రాజకీయాల్లో నిజాయితీ ఉండాల్సిందే. నీతిమాలిన పనులు చేయకుండా చూసుకోవాలి. అవినీతికి పాల్పడే నేతలను దునుమాడాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కారాదు. కానీ జరుగుతున్న తంతు చూస్తుంటే..అందుకు భిన్నంగా ఉంది. రామరాజ్యం పేరుతో.. ప్రవచనాలు పలికిన ప్రధాని మోడీ తీసుకుం టున్న నిర్ణయాలు మాత్రం పూర్తి పక్షపాతంగా ఉంటున్నాయి. జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్‌ను వేటాడి వెంటాడి ఇడి వేధించిన తీరు కళ్లకు కనబడుతున్న వేధింపు చర్యగానే చూడాలి. గిరిజన నేత కావడంతో దిక్కులేని పక్షిలా ఉన్నాడు. అదే ఎన్‌డిఎ గూటికి చేరివుంటే సోరేన్‌కు ఈ కష్టాలు తప్పేవి. తెలుగు రాష్ట్రాల్లో అవినీతి ముఖ్యమంత్రులను మాత్రం ఏమీ చేయలేకపోయారు. ఇక్కడ వీరిని ట్రంప్ కార్డుల్లా వాడుకుంటున్నారు. రేపు ఏ అవసరం వస్తుందో అన్న భయంలో కాపాడుకుంటూ వచ్చారు. అయితే అవినీతి, అహంకారానికి పాల్పడిన కెసిఆర్ కుటుంబంపై రంకెలు వేసిన ప్రధాని మోడీ ఆయనపైనా, కూతురు కవితపైనా ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. అందుకే ప్రజలు తీర్పు ఇచ్చి వారిని అధికారానికి దూరం చేశారు. అలాగే ఎపిలో కూడా జగన్ బెయిల్‌పై ఉన్నా పట్టించుకోలేదు. కేసులు ఏవీ ఆయనను ఏమీ చేయడంలేదు. ఇదంతా మోడీ ప్రాపకం వల్లనే అని చెప్పాల్సిన అవసరం లేదు. కానీ జార్ఖండ్‌లో మాత్రం అలా జరగలేదు. లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ ప్రభుత్వం బలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)ని ప్రయోగించి ఏకంగా ముఖ్యమంత్రి నే అరెస్టు చేయించింది. జార్ఖండ్‌ను తీవ్ర అస్థిరతలోకి నెట్టింది. ఊహించినట్టుగానే బుధవారం ఇడి ఆరు గంటల పాటు సోరెన్‌ను విచారించిన అనంతరం అరెస్టు చేసింది. హేమంత్ సొరెన్‌ను తన నివాసంలోనే గృహ నిర్బంధంలో ఉంచినట్లు ఇడి వర్గాలు తెలిపాయి. నాటకీయంగా జరిగిన ఈ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి హేమంత్ సోరెన్ రాజీనామా చేయక తప్పలేదు. హేమంత్ సోరెన్ వారసునిగా జెఎంఎంకు చెందిన మంత్రి చంపాయ్ సోరెన్‌ను లెజిస్లేచర్ పార్టీ ఎన్నుకుంది. హేమంత్ సోరేన్‌ను విచారించటం కోసం బుధవారం మధ్యాహ్నం రాంచీలోని హేమంత్ సొరెన్ అధికారిక నివాసానికి ఏడుగురు సభ్యుల ఈడీ బృందం చేరుకున్నది. అనంతరం ఈడీ అధికారులు ఆయనను విచారించటం ప్రారంభించారు. ఆరు గంటల సుదీర్ఘ విచారణానంతరం ఈడీ ఆయనను అదుపులోకి తీసుకున్నది. జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్‌ను రాంచీలోని ఆయన ఇంటిలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఇడి అధికారులు విచారిస్తున్న నేపథ్యంలో అనూహ్య పరిణామం చోటు చేసుకున్నది. ఇడి అధికారులపై హేమంత్ కేసు వేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలంటూ ధుర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఎలాంటి నోటీలు లేకుండానే, తాను లేని సమయంలో ఈడీ అధికారులు గత నెల 29న న్యూఢిల్లీలోని తన నివాసంలో ఉద్దేశపూర్వక సోదాలు నిర్వహించారని ఆరోపించారు. నాకు చెందిన నీలి రంగు కలర్ బీఎండబ్ల్యూ కార్‌ను సీజ్ చేశామనీ, పెద్ద మొత్తంలో అక్రమ నగదును స్వాధీనపర్చుకున్నామని అధికారులు తప్పుడు సమాచారాన్ని లీక్ చేశారని హేమంత్ వివరించారు. అయితే, వాటితో తనకు ఎలాంటి సంబంధమూ లేదని పేర్కొన్నారు. ఈడీ చర్య తనను బహిరంగ అవమానపర్చటమేనని ఆయన ఆరోపించారు. ఈడీ అధికారుల చర్యల కారణంగా తాను, తన కుటుంబం బాధపడ్డామనీ, తీవ్రమైన మనో వేధనను ఎదుర్కొన్నామనీ, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను హేమంత్ పిర్యాదులో కోరారు. ఓ గిరిజన ముఖ్యమంత్రికి ఇంతటి అవమానం జరుగుతుందని అనుకోలేదు. ఆయన తప్పుచేసివుంటే చర్యలు తీసుకోవాలి. అందరికీ ఒకే న్యాం ఉండాలి. కెసిఆర్, జగన్‌లకు లేని వేధింపులు సోరేన్‌కు మాతరమే ఎందుకని ప్రజలు ఆలోచించాలి. గతంలో అసోం సిఎం హిమంత్ బిశ్వ శర్మ కూడా ఇలాగే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బిజెపిలో చేరాక అవినీతి కేసులు మాయమయ్యాయి. భూకుంభకోణానికి సంబంధించి విచారించటం కోసం హేమంత్‌కు ఈడీ గతంలో అనేక సార్లు సమన్లు పంపింది. దాదాపు తొమ్మిది సార్లు హేమంత్ ఈడీ సమన్లను విస్మరించారు. హేమంత్ సొరెన్‌ను ఈడీ విచారిస్తున్న సమయంలో ఆయన ఇంటి వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. 144 సెక్షన్‌ను విధించారు. రాష్ట్ర రాజధాని రాంచీలోని పలు కీలక ప్రాంతాల్లో అధికారులు నిషేదాజ్ఞలు విధించారు.కేంద్రం ఆదేశాల మేరకు మా సీఎంను ఈడీ ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నదని హేమంత్ మద్ద తుదారులు ఆరోపించారు. హేమంత్‌ను ఈడీ విచారిస్తున్న సందర్భంలో జేఎంఎం కార్యకర్తలు, మద్దతుదారులు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళలకు దిగారు. ఈడీకి, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిజానికి కుంభకో ణాలకు, అవినీతికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా శిఓకు గురి కావాల్సిందే. కానీ జార్ఖండ్ మాత్రమే టార్గెట్ కావడం...కేవలం ఎన్‌డిఎ గుప్పిట లేకపోవడమే.

తెలు గు రాష్ట్రాలకు ఓ న్యాయం జార్ఖండ్‌కు మరో న్యాయం సరికాదు. అసలు రాష్ట్రాల్లో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిందే. అప్పులకు ప్పగా చేసి,దివాళా తీయించిన తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ విష యంలో మోడీ ప్రేమ చూపడం సరికాదు. ఢిల్లీ మద్యం స్కామ్‌లో ఉన్న వారినెవ రినీ వదలబోమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రకటించారు. లిక్కర్ స్కాంలో ఫోన్లు మార్చి డబ్బు తీసుకున్న బీఆర్‌ఎస్ నేతలు కూడా జైలుకు వెళ్లే సమయం తప్పకుండా వస్తుందని హెచ్చరించినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఈ దేశంలో ఎవరైనా నేరం చేస్తే శిక్ష పడేలా చేసే హక్కు న్యాయస్థానాలకే కాని ప్రభు త్వాలకు ఉండదు. ఢిల్లీ మద్యం స్కామ్ ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. మనీలాండరింగ్ చట్టాన్ని నిర్విచక్షణగా అమలు చే యడం పట్ల సుప్రీంకోర్టు ఇప్పటికే అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అయి నప్పటికీ ప్రధానమంత్రి స్వయంగా తాను రాజకీయ ప్రత్యర్థులను శిక్షిస్తా నని బహిరంగ సభల్లో ప్రకటించారు.

# ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ప్రాంతీయపార్టీలు







- **ప్రాంతీయ పార్టీల మెడకు బిగుస్తున్న ఉచ్చు**
- **ఇడి, సిబిఐ వేధింపులతో దెబ్బతీసే యత్నం**
- **ఇదే జరిగితే బపలడేది కాంగ్రెస్ మాత్రమే**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1 : ప్రాంతీయ పార్టీలకు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కలో÷-పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. నిజానికి అరవింద్ కేజీవ్రాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు. గుజరాత్, గోవాలో కాంగ్రెస్ ఓట్లను చీల్చారు, తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ఈ క్రమంలో మరోమారు ఇడి ఆయనను విచారణల పేరుతో పిలుస్తూనే ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న

అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రాంతీయ పార్టీల్లో అధికారంలో ఉన్న వైసీపీ రెండోసారి ఎన్నికల్లోనే సంకట పరిస్థితిలో పడింది. తెలుగుదేశంతో రాజకీయంగా పోరాడే బదులు ఎన్నికల సమయంలో కేసులు మోపడమే వైసీపీ అత్మరక్షణలో పడిందనడానికి నిదర్శనం. తమిళనాడులోని రెండు ప్రాంతీయ పార్టీలూ బీజేపీకి దూరంగా మారాయి. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. ఈ పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికల నాటికి దక్షిణాదిలో బీజేపీ వ్యూహం ఏ విధంగా ఉంటుందన్నదే ముఖ్యం. తెలంగాణలో మోదీ ఉధృత ప్రచారం చేసినా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అత్తెసరు సీట్లు వచ్చాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారేమోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని

బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను సిఎం పదవి వీడేలా చేసింది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల తర్వాత ఎన్ని ప్రాంతీయ పార్టీలు ఉంటాయో, ఎన్ని మిగిలి పోతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. అయితే ఏ ప్రజల ఆకాంక్షలకోసం ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయో అవి ఆ ఆకాంక్షలను విస్మ రించి అధికారాన్ని కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీత అవినీతికి పాల్పడ్డాయి. రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అనుభవాన్ని అవి విస్మరించాయి. ఇవాళ ప్రజలు కాంగ్రెస్ వైపో, బీజేపీ వైపో మళ్లుతున్నారంటే అందుకు ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీల నేతల స్వయం కృతాపరాధాలే అని చెప్పుకోవాల్సిందే.

# ఎపిలో ఒంటరి పోరు దిశగా బిజెపి అడుగులు




- **పొత్తులపై టిడిపి, జనసేనలతో కానరాని స్పష్టత**
- **వచ్చే ఎన్నికల్లో బలంగా దూసుకు వస్తోన్న కాంగ్రెస్**

అమరావతి,ఫిబ్రవరి1 : ఎపిలో ఎవరు ఎవరితో పొత్తు పెట్టుకుంటారన్నది తెలియడం లేదు. కేవలం టిడిపి, జనసేన పొత్తులు మాత్రమే పొడిచాయి. బిజెపి ఎవరితో ఉంటుందో తెలియదు. జనసేన తమతోనే అంటున్నా..అలాంటి ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. షర్మిల రాకతో కాంగ్రెస్ కూడా చురుకుగా మారింది. ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ తప్పేలా లేదు. కాంగ్రెస్, వైకాపా, బిజెపి, టిడిపి కూటమిలు పోటీ పడబోతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతోందనే అనిపిస్తోంది. జనసేన, టీడీపీతో కలిసి పోటీ చేయాలని ఆ పార్టీ నాయకులతోపాటు బీజేపీలోని ముఖ్య నాయకులు భావించారు. కానీ, ఇందుకు కేంద్ర అధినాయకత్వం సుముఖత వ్యక్తం చేయడం లేదు. గడిచిన కొన్నాళ్ల నుంచి ఏపీలో పొత్తులతోనే బీజేపీ రాజకీయాలను నెరుపుతోంది. మిగిలిన రాష్ట్రాల మాదిరిగా ఏపీలో కనీస స్థాయిలో పార్టీ పుంజుకోవడం లేదు. దీనికి కారణం పొత్తులేనని ఆ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తోంది. పొత్తు ఉన్నప్పుడు ఒకటి, రెండు స్థానాల్లో విజయం సాధించడం.. లేకపోతే కనీస స్థాయిలో ఓట్లు, సీట్లు సాధించలేని పరిస్థితిలో పార్టీ ఉండడం పట్ల అగ్రనాయకత్వం దృష్టి సారించింది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ప్రధాన పార్టీలు నుంచి కీలమైన వ్యక్తులను పార్టీలోకి తీసుకురావడంతోపాటు ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేయడం ఉత్తమమమని ఆ పార్టీ కేంద్ర నాయకత్వం భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు సీట్లు రాకపోయినా పార్టీ కేడర్‌కు రాష్ట్రంలో ఎదిగే ప్రయత్నాన్ని బీజేపీ చేస్తోందన్న భావనతో క్షేత్రస్థాయిలో గట్టిగా పని చేసేందుకు అవకాశముంటుందని చెబుతున్నారు. ఆ దిశగా ఇప్పుడు బీజేపీ చర్యలను ముమ్మరం చేసినట్టు చెబుతున్నారు. ఇకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 పార్లమెంట్ స్థానాలు పరిధిలో బీజేపీ పార్టీ

కార్యాలయాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రానున్న ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ఉద్దేశంతో బీజేపీ అధిష్టానం ఉండడంతోనే ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.

టీడీపీ, జనసేనతో పొత్తు ఉంటుందని బీజేపీలో కొంత మంది నేతలు బలంగా విశ్వసిస్తూ వచ్చారు. బీజేపీ అధినాయకత్వం ఆదేశాలతో పార్లమెంట్ స్థానాలు పరిధిలో కార్యాలయాలు ఏర్పాటుకు ఆదేశాలు రావడం,

మరో పక్క జనసేన, టీడీపీ అభ్యర్థుల ప్రకటనకు సిద్ధమవుతుండడంతో పొత్తు లేనట్టేనన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పొత్తు ఉంటటుందని ఆశించిన బీజేపీలోని కొందరు ముఖ్య నేతలు ఏం చేయబోతున్నారన్న చర్చ నడుస్తోంది. పార్టీ అభ్యర్థులను కొద్దిరోజుల్లో ప్రకటించే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే కీలక అభ్యర్థులను పోటీలో దింపేందుకు అనుగుణంగా ఆ పార్టీ దృష్టి సారించింది. ప్రధాన పార్టీలు నుంచి బీజేపీలోకి వచ్చే వారిపైనా నాయకులు దృష్టి సారించారు. ఇతర పార్టీల్లోని ముఖ్య నాయకులను ఆహ్వానించడం ద్వారా స్థానికంగా కొంత బలోపేతం కావచ్చని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, విశాఖలోని ఉత్తర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు వంటి వారంతా ఉమ్మడిగా పోటీ ఉంటుందని బలంగా విశ్వసించారు. కానీ, బీజేపీ తాజాగా తీసుకుంటున్న నిర్ణయాలు దానికి వ్యతిరేకంగా ఉండడంతో వీరి ఆలోచన ఎలా ఉండబోతుందన్న దానిపైనా ఆసక్తి నెలకొంది. బీజేపీ రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేయాలన్న ఆలోచన వెనుక బలమైన కారణం ఉన్నట్టు చెబుతున్నారు. బలమైన అభ్యర్థులతో పోటీలోకి వెళితే క్షేత్రస్థాయిలో బలంపై ఒక అంచనాకు వచ్చి.. 2029 నాటికి రోడ్ మ్యాప్ వేయాలన్నది వారి మొదటి లక్ష్యం. ఏపీలో గెలిచే సీట్లుపై బీజేపీ ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. ఇక్కడ ఏ పార్టీ గెలిచినా తమకే సహకారాన్ని అందించేందుకు ఉవ్విళ్లూరుతున్న నేపథ్యంలో పొత్తుకు వెళ్లాల్సిన అవసరం ఏమిటన్న భావనలో ఆ పార్టీ అగ్రనాయకత్వం ఉండడం వల్లే.. కలిసి పోటీ చేయడంపై అగ్రనాయకత్వం సానుకూలతను వ్యక్తం చేయడం లేదని ఆ పార్టీ ముఖ్య నాయకులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉన్న రాజకీయ సమీకరణాలు ప్రకారం పొత్తు లేనట్టే కనిపిస్తోంది.

# అయోధ్య రాముడు అందరివాడు

## మతాలకు అతీతంగా ప్రజల సందర్శన



అయోధ్య,ఫిబ్రవరి1 : అయోధ్య ఆలయంలో బాల రాముడు విశేష పూజలు అందుకుంటున్నారు. రాములోరిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వస్తున్నారు. ఇతర మతాలకు చెందినవారు అయోధ్య చేరుకుంటున్నారు. వారిలో కొందరు ముస్లింలు ఉన్నారు. 350 మంది ముస్లింలు అయోధ్య రాములోరి దర్శనం కోసం వచ్చారు. రాష్ట్రీయ్ స్వయం సేవక్ మద్దతు గల ముస్లిం రాష్ట్రీయ మంచ్ నేతృత్వంలోని బృందం బయల్దేరింది. ముస్లిల బృందం లక్నో నుంచి కాలినడకన అయోధ్య చేరుకుంది. చలిలో 150 కిలోమీటర్లు కాలి నడకన వచ్చి తమ భక్తిని చాటుకుంది. 'ప్రతి 25 కిలోమీటర్లు నడిచిన తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకున్నాం. రాత్రి పడుకొని, మరునాడు బయలుదేరాం. ఆరు రోజుల తర్వాత అయోధ్య చేరుకున్నాం. బాల రాముడిని దర్శించుకొని తరించాం. రాములోరి దర్శనం హిందు- ముస్లింల ఐక్యతను పెంచి, దేశ సమగ్రతను కాపాడుతుంది' అని ముస్లిం రాష్ట్రీయ మంచ్ మీడియా ఇంచార్జ్ షాహిద్ సయీద్ ఆశాభావం వ్యక్తం చేశారు. 'భగవాన్ శ్రీ రాముడు పూర్వీకుడు అని.. కులం, మతం కన్నా దేశం కోసం ప్రేమ, మానవత్వం ఎక్కువ. ఏ మతం ఇతరులను విమర్శించడం, ఎగతాళి చేయడం లేదంటే అసహ్యించుకోవాలి అని' బోధించదని ఎంఆర్ఎం కన్వీనర్ రాజా రయీస్ తెలిపారు.

# హిట్ అండ్ రన్ ఘటనలతో ఆందోళన

## ప్రమాదాల్లో బలవుతున్న అమాయక ప్రజలు



హైదరాబాద్,ఫిబ్రవరి1 : భాగ్యనగరంలోని వరుసగా జరుగుతున్న హిట్ అండ్ రన్ ప్రమాదాలతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. వాహనాలతో ఢీకొట్టి ఆపై ఆపకుండా పరారవుతున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ కారణంగా అనేక మంది అమాయక ప్రజలు బలవుతున్న పరిస్థితి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. నగరంలో వారం రోజుల వ్యవధిలో రెండు హిట్ అండ్ రన్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.బుధవారం జూబ్లీహిల్స్‌లో ఓ స్పోర్ట్స్ కార్ బీభత్సం సృష్టించింది. అతివేగంతో దూసుకొచ్చిన కారు.. రెండు బైక్‌లను ఢీకొట్టింది. ప్రమాదం అనంతరం కారుతో యువకులు పరారయ్యారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్పోర్ట్స్ కారు గుంటూరుకు చెందిన వారిదిగా గుర్తించారు. బిక్కి అశోక్ పేరు మీద స్పోర్ట్స్ కార్ రిజిస్టర్ అయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బిక్కి అశోక్ గుంటూరు కాటమురు ప్రాంతానికి చెందిన వ్యక్తి. దీంతో నిందితుల కోసం జూబ్లీహిల్స్ పోలీసుల బృందం గుంటూరుకు బయలుదేరింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు వ్యక్తులు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మాదాపూర్‌లోని మేడికోవర్ ఆస్పత్రిలో అన్నాచెలలెళ్లు ఉదయ్, సుష్మ ( స్వీటీ ) చికిత్స పొందుతున్నారు. ఉదయ్, సుష్మలకు మల్టిపుల్ ఫ్యాక్చర్స్ అయినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వీరిద్దరికి ఐసీయూలో ఉంచి చికిత్స అందజేస్తున్నారు. ఈ ప్రమాదంలోనే గాయపడిన మరో వ్యక్తి ట్రీట్‌మెంట్ చేయించుకుని డిశ్చార్జ్ అయి వెళ్లిపోయినట్లు వైద్యులు తెలిపారు. కాగా.. జూబ్లీహిల్స్‌లో జనవరి 24 తెల్లవారుజామున జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదంలో బౌన్సర్ మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పెద్దమ్మగుడి వద్ద బైక్‌పై వెళ్తున్న వారిని అతివేగం దూసుకొచ్చి కారు ఢీకొట్టింది. అనంతరం కారు ఆపకుండానే అక్కడినుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బౌన్సర్ తారక్ రాం అక్కడికక్కడే మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో బైక్ 20 అడుగుల దూరంలో ఎగిరి పడిన దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజ్‌లో రికార్డ్ అయ్యాయి. ఈ కేసులో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదం జరిగి వారం రోజులు గడవక ముందో మరో హిట్ అండ్ రన్ కేసు నమోదు అవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

## కేజీబీవీ మురికి నీరుతో విషజ్వరాలు

వేలేరు ఫిబ్రవరి 01 (ప్రజామంటలు) :



వేలేరు మండలం గొల్లకిష్ణంపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల నుంచి మురికి నీరు రావడంతో గత మూడు సంవత్సరాల నుంచి వాసనతో విషరాలు వస్తున్నాయని, ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎవరూ పట్టించుకుంట లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని, మా సమస్యలను పరిష్కరించాలని దళిత కాలనీవాసులు కోరుతున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే ఓట్ల కోసం రాజకీయ నాయకులు వస్తారని, మా సమస్యలను ఎవరు పట్టించుకుంటలేరని కాలనీ వస్తువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతిని వివరణ కోరగా, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడం తెలిపారు.

## మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విధులు నిర్వహించాలి

### జిల్లా ఎస్పీ శ్రీసన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్

జగిత్యాల ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):




మారుతున్న టెక్నాలజీ కి అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అన్నారు. ఈరోజు స్థానిక ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో లో పోలీస్ శాఖ ఉపయోగిస్తున్న ఐసి జెఎస్, టిఎస్ సిఓపి, సిసిటిఎన్ఎస్ కు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... నిందితులను అరెస్టు చేసేటప్పుడు ఇంటరాగేషన్ రిపోర్ట్ నందు నిందితుల యొక్క పూర్తి వివరాలు సేకరించి సిసిటిఎన్ఎస్ ప్రాజెక్ట్ లో ఎంట్రీ చేయాలని ఎంట్రీ చేసేటప్పుడు నిందితుల యొక్క క్వాలిటీ డాటా ఎంట్రీ చేయాలని అన్నారు. ఈ యొక్క డాటా బేస్ ద్వారా ఎన్నో కేసులు చేదించ వచ్చని తెలిపారు. రాబోవు తరాల వారికి డాటా ఎంతో ముఖ్యమని ఏ చిన్న తప్పిదం లేకుండా డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. ప్రస్తుతం పోలీసు శాఖ లో సాంకేతిక వ్యవస్థ కీలక భాగంగా ఉందని, ఎప్పటికపుడు వివరాలు ఆన్లైన్ లో సరైన విధంగా నమోదు చేస్తూ మరింత పటిష్టమైన వ్యవస్థ రూపొందించడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలి, వృత్తి నైపుణ్యంలో రోజువారీ పురోగతి సాధించాలని అన్నారు. అనతరం ఐ సిజెఎస్, టిఎస్సి ఓపి, సి టిఎన్ఎస్ అప్లికేషన్ల పనితీరు కు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐటీ కోర్ సిబ్బంది అదికారులకు వివరించారు. ఈ యొక్క శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర రావు, డీఎస్పీలు రవీంధ్ర కుమార్, రవీంద్ర రెడ్డి , మరియు సి.ఐ ఎస్.ఐ. లు డి సి ఆర్ బి ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాయి జీనియస్ హై స్కూల్ వీడ్కోలు వేడుకలు

కోరుట్ల ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):




కోరుట్ల పట్టణంలోని సాయి జీనియస్ హై స్కూల్ లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమయాన్ని వృధా చేయకుండా భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని అలాంటి వాటి కోసం కృషి చేయాలని సూచించారు. మార్చి నెలలో జరగబోయే పరీక్షలకు సంసిద్ధులై ఉండాలని ఉత్తమ ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరాలంటే ఏకాగ్రత తో చదవాలని కష్ట పడి కాకుండా ఇష్ట పడి చదవాలని అప్పుడే మనం అనుకున్న లక్ష్యాలు చేరుకోగలమణి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చౌకి సుధ, గణేష్, రమేష్, సురేష్, రాజేందర్, వసంత, లక్ష్మిరాజ్యం ఇతరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పశు వైద్య శిబిరాలు

గొల్లపల్లి ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):

పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పశు వైద్య కళాశాల కోరుట్ల పశు వైద్య పశుసంవర్ధక శాఖ జగిత్యాల జిల్లా సహకారంతో జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రత్యేక పశు వైద్య శిబిరాలు గురువారమురాఘవపట్నం, తిరుమలాపూర్, ఇస్రాజ్ పల్లి గ్రామాలలో నిర్వహించారు. ఈ శిబిరాలలో 300 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్సలను, 200 మెడిసిన్ చికిత్సలను, 10 శస్త్ర చికిత్సలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రావు మాట్లాడుతూ ఈ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోరుట్ల వెటర్నరీ కళాశాల అసోసియేట్ తక్కల్లపల్లి మాధవరావు మాట్లాడుతూ కళాశాల నుండి అందించబడుతున్న వివిధ సేవలను రైతులకు వివరించారు టి ఎస్ ఎల్ డి ఏ కరీంనగర్ ఈవో డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కృతమ గర్భధారణ సక్సెస్ సెవెన్ వంటి వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంబిక, డాక్టర్ సురేష్, డాక్టర్ పరశురాములు, పశుసంవర్ధక శాఖ డాక్టర్లు డాక్టర్ తిరుపతి గౌడ్ డాక్టర్ బద్దం రాజేందర్, సర్పంచ్ రాగం శంకరయ్య ,ఎంపిటిసి ఉప సర్పంచ్ అంజి, మధుకర్, ఎంపీడీవో నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, కళాశాల అధ్యాపకులు 67 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




# పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటా

### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల ఫిబ్రవరి 01(ప్రజామంటలు):

పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ జిల్లా, డివిజన్, మండల, పట్టణాల ప్రతినిధులు జగిత్యాల ఎమ్మెల్యే ను కలిసి తమ సమస్యలను వివరించారు. అనంతరం అసోసియేషన్ ముద్రించిన 2024 డైరీలను, క్యాలెండర్లను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి దశ, మలి దశ ఉద్యమాల్లో కేసీఆర్ తో వెంట నడిచిన పెన్షనర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పీఆర్సీలో 43 శాతం పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. పెన్షనర్లకు 70 ఏళ్లకే ఖ్వా0టం పెన్షన్ అందించారన్నారు. పెన్షనర్లకు ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే గౌరవ భృతిపై ఆదాయపు పన్ను విధించడంపై పెన్షనర్స్ అసోసియేషన్ చేస్తున్న ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకొక పోవడము సరి కాదన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి శోక్ కుమార్ మాట్లాడుతూ తమ పెన్షనర్స్ కు అన్ని విధాలుగా అండగా ఉంటామన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ ఆద్యక్షుడు పి.సి. హన్మంత రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.డి.యాకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల అశోక్ రావు, సత్యనారాయణ,



మహిళా కార్యదర్శి బోబ్బాటి కరుణ, సంయుక్త కార్యదర్శి విట్ఠల్,,జగిత్యాల యూనిట్ అధ్యక్షుడు బి. రాజేశ్వర్, కోశాధికారి నర్సయ్య, జాయింట్ సెక్రటరీలు ఎం.డి.ఎక్బాల్, నారాయణ,, సయ్యద్ యూసుఫ్, హన్మాండ్లు, మల్యాల్ అధ్యక్షుడు యాకూబ్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, ప్రతినిధులు దేవేందర్ రావు, కండ్లే గంగాధర్, గంగారెడ్డి, మురలీదర్, జిల్లా, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్పంచులు ఆందోళన చెందవద్దు..

### ప్రతి పైసా బకాయి ప్రభుత్వం చెల్లిస్తుంది

### గ్రామాల అభివృద్ధికి ఉపాధిహామీ నిధులే ఆధారమయ్యాయి

### తిమ్మాపూర్ గ్రామ పంచాయితీ పాలక వర్గ సన్మానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి..

జగిత్యాల ఫిబ్రవరి 01( ప్రజామంటలు)




అర్బన్ మండలం తిమ్మాపూర్ గ్రామ పంచాయితీ పాలకవర్గ పదవీ కాలం ముగియడం తో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులను గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రభుత్వం గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ కొనుగోలు చేయాలని సూచన చేసి, నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామ పంచాయితీపై ఆర్థిక భారం మోపింది. మిషన్ భగీరథ నీరు తాగేందుకు అనుకూలంగా లేకపోవడంతో తాగునీరు కోసం డబ్బా నీరు కొనుగోలు చేసుకొని తాగున్నారని అన్నారు. భారత ప్రధాని రాజీవ్ 73, 74 రాజ్యాంగ సవరణలతో స్థానిక సంస్థలను బలోపేతం చేశారు. సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంతోపాటు నేరుగా ఢిల్లీ నుండి గ్రామ పంచాయితీలకు నిధులు మంజూరు చేయాలని రాజ్యాంగంలో పొందుపర్చడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు కేంద్రం నుండి నేరుగా నిధులు మంజూరు అవుతున్నాయనిన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని, ఇప్పటికే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాదయం అమలు చేస్తోందన్నారు. త్వరలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని. పెన్షన్ రూ. 4000 లకు పెంచారామని, ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. పెళ్లి సాయం కింద రూ. 1లక్షకు అదనంగా తులం బంగారం ఇవ్వాలనే ఆలోచనే తనదేనని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 8 లక్షలు మంజూరు చేస్తామని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.

## ప్రవాసి కార్యకర్త గ్రామంలో తిరుగుతూ గ్రామ స్థితిగతులు తెలుసుకోవాలి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. భోగ శ్రావణి ప్రవీణ్

రాయికల్ ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):



"గావ్ చలో బస్తీ చలో" అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాయికల్ పట్టణ, మరియు మండల ప్రవాసి ఈ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జ్ డా. భోగ శ్రావణి మాట్లాడుతూ.... "గావ్ చలో బస్తీ చలో" అభ్యన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ప్రవాసి కార్యకర్తలను నియమించడం జరుగుతుందనీ, ఈ ప్రవాసి కార్యకర్తలు ప్రతి గ్రామానికి మరియు ప్రతి వీధికి వెళ్లాల్సి ఉంటుంది ఆ ప్రవాసి కార్యకర్త ఆ గ్రామంలో ఒక రోజు మొత్తం ఆ గ్రామంలో తిరుగుతూ స్థితిగతులను పరిశీలించి గ్రామంలో బూతు కమిటీలను అధ్యయనం చేసి అక్కడ ఉన్నటువంటి వివిధ సంఘాల నేతలను, మరియు కవులు, కళాకారులు, క్రీడాకారులను కలిసి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల గురించి వివరించి ఆ గ్రామంలోని సమస్యల గురించి చర్చలు జరపాలన్నారు. పేదల సంక్షేమం మహిళా సాధికారత అంతర్గత బాహ్య భద్రత సాంస్కృతిక పునరుద్ధరణ విదేశాల్లో భారతదేశ గౌరవాన్ని పెంచడం వంటి అనేక రంగాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గత 10 సంవత్సరాలుగా ఊహకు కూడా అందని సాధారణ అభివృద్ధి సాధించింది, అభివృద్ధి దార్శనికతకు కేంద్ర రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా 2024 లోక్సభ ఎన్నికల్లో ప్రజల మద్దతు కూడగొట్టి యావత్ దేశ ప్రజలను విశ్వాసాన్ని చురగొనాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివం, రాయికల్ పట్టణ అధ్యక్షులు కల్లెడ ధర్మపురి, రాయికల్ మండల అధ్యక్షులు అన్నవేని వేణు, ఎంపీటీసీ మహేష్, ఉపాధ్యక్షులు పసునూరి శ్రీనివాస్, కన్వీనర్ సామల్ల సతీష్, కో కన్వీనర్ బుర్ల గోపి, మచ్చ నారాయణ, మూగల మారుతి,కుర్మా మల్లారెడ్డి, మంగళారపు లక్ష్మీనారాయణ, తోగిట లక్ష్మీనారాయణ, బాల శేఖర్, రాజగోపాల్ బూత్ అధ్యక్షులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు మండల పట్టణ పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ




మొగుళ్లపల్లి ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):

మండలంలోని మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి శనిగరపు రమేష్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. అలాగే సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ొా %. పెండింగ్లో ఉన్న మూడు డిఏలను, బిల్లులను వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చెల్పూర్ శర్మ, జిల్లా బాధ్యులు వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లు వచ్చేశారు

### వివరాలు వెల్లడించిన ఎంపీడీవో లంకపల్లి భాస్కర్

భీమదేవరపల్లి ఫిబ్రవరి 01 (ప్రజామంటలు) :




రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల పదవీకాలం జనవరి 31న ముగియడంతో వారి స్థానంలో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. స్థానిక సంస్థల ఎన్నికల వరకు పరిపాలన కుంటు పడకుండా ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. వీరు పంచాయతీ కార్యదర్శులతో కలిసి పనిచేస్తారు. మండలంలోని 22 గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎంపీడీవో లంకపల్లి భాస్కర్ వివరాలు వెల్లడించారు. భీమదేవరపల్లి గ్రామానికి తహసిల్దార్ ఏ. ప్రవీణ్ కుమార్, బొల్లంపల్లి రాంనగర్ గ్రామాలకు ఏఈ గ్రీడ్ సాయికృష్ణ, చంటయ్యపల్లికి ఏఈ ఆర్డబ్ల్యూఎస్ రాజమల్లారెడ్డి, ధర్మారం కు మండల విద్యాధికారి ఏ. వెంకటేశ్వర్లు, గాంధీనగర్ మాణిక్యాపూర్ గ్రామాలకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఏ. రాజేష్, గట్ల నర్సింగాపూర్, కొత్తకొండ గ్రామాలకు ఎంపీవో కె. నాగరాజు, గొల్లపల్లి, ముస్తఫాపూర్ గ్రామాలకు అగ్రికల్చర్ ఆఫీసర్ అఫ్జల్, కొప్పూరు, వంగర గ్రామాలకు డిప్యూటీ తాసిల్దార్ జి. వేణుగోపాల్, విశ్వనాథ కాలనీ, కొప్పూర్, రసూల్ పల్లి గ్రామాలకు ఎంపీడీవో లంకపల్లి భాస్కర్, మల్లారం వీర్లగడ్డ తండాలకు ఏఈ పిఆర్ సిహెచ్. సంతోష్ కుమార్, ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీకి డిపిఓ సుదర్శన్, ముత్తారం గ్రామానికి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఈ మాలతి, రంగయ్యపల్లి గ్రామానికి వెటర్నరీ సర్జన్ పార్థసారథి, రత్నగిరి గ్రామానికి సిడిపిఓ ఈ స్వరూపలను కేటాయించినట్లు తెలిపారు.

## జోరుగా ఇసుక రవాణా దందా నిద్రమత్తులో అధికారులు..



వేలేరు ఫిబ్రవరి 01 (ప్రజామంటలు) :

వేలేర్ మండల కేంద్రంలో జోరుగా ఇసుకే రవాణా దందా పట్టపగలు రవాణా జరుగుతున్న తీరును చూసి చూడనట్టు చూస్తున్న అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా ఇసుక అమ్ముతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు ఇప్పుడైనా మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని అధికారులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

prajamantalau daily pages (02-02-24)G_times of varha main (13-2).qxd 2/2/2024 3:27 AM Page 5



# అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ విజయవంతం

## జిల్లాలో 45 మంది బాల కార్మికులకు విముక్తి

## జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్

జగిత్యాల ఫిబ్రవరి 01 (ప్రజామంటలు)




బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయ వంతంగా నిర్వహించడం జరిగింది. ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో ఒక సబ్-ఇన్స్ పెక్టర్, ముగ్గురు కానిస్టేబుల్స్,ఒక మహిళ కానిస్టేబుల్ ను ప్రత్యేకంగా కేటాయించి చైల్డ్ లైన్ తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది . ఇందులో భాగంగా ఈ సంవత్సరం జనవరి 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది ఇందులో 45 మంది బాలకార్మికులను గుర్తించి సిడబ్ల్యూ సి (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) ముందు హాజరుపరచడం జరిగింది. 45 మంది బాలకర్మికులలో తెలంగాణా రాష్ట్రానికి చెందిన 18 మందిని రిహాబులేషన్ సెంటర్ కి తరలించి వారిని స్కూల్స్ లో జాయిన్ చేయడం జరిగింది. ఇతర రాష్ట్రాలకు చెందిన 27మంది వారి వారి రాష్ట్రాలకు పంపించి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ.... బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుంది అని అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరు అని తెలిపారు. బాలకార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# మాదిగ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్‌గా దుబ్బయ్య

జగిత్యాల, ఫిబ్రవరి 01 (ప్రజామంటలు)



ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాదిగ జేఏసీ ఇంచార్జ్ గా మెడపట్ల దుబ్బయ్యను నియమించారు. ఇదివరకు మాదిగ జేఏసీ జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన మెడపట్ల దుబ్బయ్య సమర్థవంతంగా పనిచేసినందుకే ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ గా నియమించినట్లు మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డా. పిడమర్తి రవి నియామక పత్రంలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మాదిగ జేఏసీ బలోపేతానికి కృషిచేయాలని, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల ఇంచార్జ్ లను సత్వరమే నియామకాలు చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షులు పేర్కొన్నట్లు దుబ్బయ్య పేర్కొన్నారు. ఎస్సి వర్గీకరణ సాధనకై ఈ నెల 5, 6 తేదీలలో చేపట్టే చలో ఢిల్లీని విజయవంతం చేయాలని దుబ్బయ్య కోరారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షులు డా. పిడమర్తి రవి కి ఈ సందర్భంగా దుబ్బయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# పొలాస గ్రామం అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల ఫిబ్రవరి 01 (ప్రజామంటలు)
రూరల్ మం. పొలాస గ్రామంలో పలు అభివృద్ధి పనులు, డ్రైనేజ్, రోడ్లు, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. ఆయన వెంట సర్పంచ్ గాజంగి భారతి నందయ్య, ఉప సర్పంచ్ షాహిద్, నాయకులు తదితరులు ఉన్నారు.

# ఆపదలో ఉన్న గిరిజన బిడ్డకు తన వంతుగా ఆర్థికంగా అభయ హస్తం

సైదాపూర్ ఫిబ్రవరి 01 (ప్రజామంటలు)



కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం మండలంలో ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన యాక్సిడెంట్లో లో గన్ పూర్ తండా గిరిజన బిడ్డ అయినా బానోతు అలియా కు ఇవాళ హనుమకొండ లో రోహిణి హాస్పిటల్ లో కలిసి పరామర్శించడం జరిగింది. ఆర్థికంగా వారి వంతు సహాయము చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ నాయక్ మాజీ సర్పంచ్ బిక్షపతి నాయక్ రాయికల్ తండా యూత్ ప్రెసిడెంట్ తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

# గాగిరెడ్డి పల్లె గ్రామ పంచాయితీ పాలకవర్గం పనితీరు భేషుగ్గా ఉంది

## సర్పంచ్ ఆత్మీయ వీడుకోలు సమావేశం

## ఎంపీపీ, జెడ్పీటీసిల ప్రశంసలు



చిగురుమామిడి ఫిబ్రవరి 01 (ప్రజామంటలు )

చిగురుమామిడి మండలం గాగిరెడ్డి పల్లెలో గ్రామపంచాయతీ పాలకవర్గం పదవి కాలం 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సర్పంచ్ మరియు వార్డు సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన సమావేశం ఏర్పాటు చేశారు. విద్యా కమిటీ మాజీ చైర్మన్ మంద శ్రీనివాస్ మరియు అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన ఆత్మీయ సన్మాన సభకు ఎంపీపీ కొత్త వినిత, జడ్పీ ఫ్లోర్ లీడర్ రవీందర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ సన్నీళ్ళ వెంకటేశం గత ఐదు సంవత్సరాలుగా పాలకవర్గం సహకారంతో, అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని ఆయన సేవలు కొనియాడారు. జిల్లాలో గాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక కావడం ఆయన పనితీరుకు నిదర్శనమన్నారు. అంతేగాక వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలందరూ చైతన్యంతో అభివృద్ధికి తోడ్పడడం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కంటే ముందు వరుసలో ఉంచిందన్నారు. ఇదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల్లో కూడా నిజాయితీగా, ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే వారిని పాలకవర్గ సభ్యులు ఎన్నుకోవాలని వక్తలు కోరారు. అనంతరం సర్పంచి సన్నీల వెంకటేశం మరియు ఉప సర్పంచ్ అన్నాడి మల్లికార్జున్ రెడ్డి మరియు వార్డు సభ్యులందరికీ ఎంపీపీ జడ్పిటిసిలతో పాటు గ్రామస్తులందరూ పూలమాలతో సత్కరించి, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ లతో పాటు వార్డు సభ్యులు సువర్ణ, రవి, నరేందర్ రెడ్డి, సంధ్య, లావణ్య, సదానందం రేణుక, సంపత్, లక్ష్మి, రాజేశ్వర్ రెడ్డి, మంద విమల, ముత్తయ్య, నాగయ్య, శ్రీదర్, చంద్రయ్య, భూమయ్య, ఎల్లయ్య, శంకర్, రాజయ్య, పర్శరాములు, వెంకటేశ్ గౌడ్, మధుగౌడ్, సతీష్ యాదవ్, శ్రీకాంత్, ప్రశాంత్ తో పాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో మొదటి రోజు విద్యార్థులకు ప్రశాంతంగా జరిగిన

## ఇంటర్ ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్

జగిత్యాల ఫిబ్రవరి 01(ప్రజామంటలు):



నేడు ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 87శాతం విద్యార్థులు హాజరు అయ్యారు. గురువారము జరిగిన జనరల్ విభాగం లో 373 విద్యార్థులకు గాను 364 మంది విద్యార్థులు హాజరు కాగా 9 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్ విభాగంలో 736 విద్యార్థులు పరీక్షలు వ్రాయవలసి ఉండగా 595 మంది హాజరై 141 మంది గైర్హాజరు అయ్యారు., మధ్యాహ్నం జరిగిన పరీక్షలో జనరల్ విభాగంలో 144 మంది విద్యార్థులకు గాను 139 మంది విద్యార్థులు హాజరై 5గురు గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్ లో 814 కు గానూ 726 హాజరై 88 గైర్హాజరు అయ్యారు. మొదటిరోజు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కన్వీనర్ బి.నారాయణ తెలిపారు.

# చిల్వకోడూరు అంగన్వాడీ కేంద్రాలలో న్యూట్రిషన్ హెల్త్ డే

గొల్లపల్లి ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):



గొల్లపల్లి మండలం చిల్వకోడూరు లో సూపర్వైజర్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ హెల్త్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల యొక్క బరువులు, ఎత్తులు, చుట్టుకొలతలు, పొడవులు గర్భిణీ స్త్రీల యొక్క బరువులు, ఎత్తులు, చుట్టుకొలతలు ఆహారంలో గ్రామీణ ప్రాంతాలలో దొరికే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గింజ ధాన్యాలు రక్తహీనత గూర్చి గర్భిణీలకు పిల్లల తల్లులకు గ్రోత్ కార్డును ఉపయోగించి అతి తీవ్రలోప పోషణ తక్కువ తీవ్రలోప పోషణ పిల్లలకు బాలామృతం ప్లస్సును పిల్లల యొక్క బరువు తగ్గ ప్యాకెట్స్ తప్పకుండా పిల్లలకు తినిపించవలెనని ఇంటి లోపల అన్ని రకాల ఆహార పదార్థాలు పండ్లు పాలు పిల్లలకు తల్లులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రంలో శ్రీమంతము అన్న ప్రసన్న బాలామృతం ఎగ్స్ టి హెచ్ ఆర్ పంపిణీ చేయడం 11 రోజుల బాలెంత ఇంటిని సందర్శించి ఆమె తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆహారం ఆరోగ్యం సమస్యల గురించి పిల్లవాడికి టైం ప్రకారం ఇంజక్షన్స్ వేయించవలెనని ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ మమత, హెల్త్ సూపర్వైజర్ శారద, ఏఎన్ఎం సుమలత అంగన్వాడీ టీచర్స్ విజయలక్ష్మి, నర్మద, గంగాభవాని, ఆశా వర్కర్ జమున, గర్భవతులు, బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# గద్దర్ పేరున అవార్డుల నిర్ణయం అభినందనీయం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):



గద్దర్ పేరున కవులు, కళాకారులు, సినిమా వాళ్ళకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అవార్డులు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమని అఖిల భారత్ ముదిరాజ్ సంఘ అద్యక్షులు పొట్లకాయల వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ..కేసీఆర్ సర్కార్ హాయంలో సినిమాలకు నంది అవార్డులు ఇవ్వడం మానేశారని, తిరిగి వీటిని పునరుద్దరించడం సరైన నిర్ణయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులకు సరైన గుర్తింపును కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందనడానికి ఇదో ఉదాహరణ అని అన్నారు. అలాగే దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న ముదిరాజ్ ల సమస్యలను తీర్చాలని ఆయన సీఎం ను కోరారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీని బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని వెంకటేశ్వర్ కోరారు.

# తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా భాద్యతలు స్వీకరించిన వేణు గోపాల్‌కు అభినందనల వెల్లువ

హైదరాబాద్ ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):



తెలంగాణ ప్రభుత్వ సచివాలయంలో ప్రభుత్వ సలహాదారుగా భాద్యతలు స్వీకరించిన హర్కార వేణుగోపాల్ రావును నేడు పలువురు అధికారులు, అభిమానులు,కుటుంబ సభ్యులు యల్పీజి డీలర్ల సంఘ ప్రతినిధులు వ్యక్తిగతంగా కలిసి అభినందించారు. తెలంగాణ వంటగ్యాస్ డీలర్ల పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, కార్యదర్శి శ్రీచరణ్, మీడియా సమన్వయ కర్త పి.వి. మదన్మోహన్, కోశాధికారి ఐలారెడ్డి , మాజీ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, సీనియర్ ప్రతినిధులు సుందర రామయ్య, పనకంటి శ్రీధర్, మూర్తి,రాజ్ మోహన్,సంతోష్ రెడ్డి,రమేశ్, ఐఓసియల్ విశ్రాంత అధికారి బాలాజీ , జెకె శ్రీధర్ ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ వంటగ్యాస్ డీలర్ల సమస్యలు పరిష్కారానికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు.

# ఆదాయ పన్ను పరిమితి పెంచి ఉండాల్సింది

సికింద్రాబాద్, ఫిబ్రవరి 01 (ప్రజామంటలు) :



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ లో ఆదాయ పన్ను పరిమితిని పెంచకపోవడం దురదృష్టకరమని సికింద్రాబాద్ తెలుగు దేశం పార్టీ ఇంచార్జీ వల్లారపు శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం బౌద్ధనగర్ లో మీడియాతో మాట్లాడుతూ... పీఎం కిసాన్ యోజన కింద రైతులకు రూ9వేలు ఇస్తామని గత ఎన్నికల సమయంలో హామీనిచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. కేవలం ప్రచార ఆర్భాటాలకు పోకుండా క్షేత్రస్థాయిలో రైతులు, సామాన్యులు పడుతున్న కష్టాలను చూసి, వీరికి లబ్ది చెందే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

# మహిళా రైతులకు ముల్కనూర్ డైయిరీ ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన

భీమదేవరపల్లి ఫిబ్రవరి 01 (ప్రజామంటలు):



తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ములుకనూరు మహిళా డైయిరీ పాడి రైతులకు పషు పోషణలో భాగంగా పశుగ్రాసం కొరకు (సోర్గం) విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా బుధవారం ఆర్మూర్ లో డైయిరీ అధ్యక్షులు, పాలకవర్గము, సంఘాల అధ్యక్షులు, డేయిరి లైఫ్ స్టాక్ సెంటర్ సిబ్బంది అవగాహన కొరకు క్షేత్ర పర్యటన చేయడం జరిగింది.

# అక్రమ పాస్‌పోర్టు కేసులో ముమ్మర దర్యాప్తు

## ఇప్టపికే 14మందిని అరెస్ట్ చేసి విచారణ

**హైదరాబాద్:** నకిలీ పాస్‌పోర్ట్ స్కామ్‌లో ఇప్పటి వరకు 14 మందిని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇటీవల నిజామాబాద్‌కు చెందిన ఎస్‌బీ ఏఎస్ఐ లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసిన అధికారులు తాజాగా ఆదిలాబాద్‌లోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రణబ్‌ను అరెస్ట్ చేశారు. నకిలీ పాస్‌పోర్టు వ్యవహారంతో సంబంధం ఉన్న వారి కోసం దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. నకిలీ డాక్యుమెంట్లతో ఇప్పటి వరకు శ్రీలంకకు చెందిన 65 మందికి పాస్‌పోర్ట్ జారీ చేసినట్లు గుర్తించారు. వీరంతా అక్రమంగా వలసలు వచ్చిన వారిగా తేల్చారు.



ఈరోజు టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ అసెంబ్లీ స్పీకర్ సమక్షంలో గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తెలంగాణ మొట్టమొదటి మాజీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ "రాజేశం గౌడ్" మాజీ బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ కు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నాగోబాను దర్శించుకోబోతున్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి

## నేడు సిఎం రేవంత్ రాకతో భారీగా ఏర్పాట్లు



**ఆదిలాబాద్:** ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా.. నేతల కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతోంది. నాగోబా జాతర మేస్రం వంశీయుల (గిరిజనుల) అతి పెద్ద పండుగ. నాగోబా జాతర వేళలో ఆదివాసీలే కాదు ఆదివాసీయేతరులు కూడా పెద్ద ఎత్తున దర్శనం చేసుకుంటారు. నేతలు సైతం భక్తి శ్రద్దలతో నాగోబాకు మొక్కులు చెల్లించుకుంటారు. అలా మొక్కులు చెల్లించుకుని, దర్శించుకున్న వారిలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి ముందు వరుసలో నిలిచారు. తాజాగా సీఎం హోదాలో తొలి తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి దర్శించుకోబో తున్నారు. కెసిఆర్ సిఎంగా ఉండగా నాగోబాను దర్శించుకోలేక పోయారు. తెలంగాణ రాష్ట్ర పండగగా కొనసాగుతున్న నాగోబాకు తొలి తెలంగాణ ముఖ్యమంత్రి గా ఫిబ్రవరి 2 న రేవంత్ రెడ్డి రాబోతున్నారు. రేవంత్ రెడ్డి తొలిసారిగా ఎంపీ పదవిలో కొనసాగిన సమయంలో.. 2021 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి మండలానికి వచ్చి నాగోబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆ తరువాత ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. పీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యాక.. అదే ఏడాది 9 ఆగస్టు 2021న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో నిర్వహించిన 'దళిత–గిరిజన' దండోరా భారీ బహిరంగ సభకు హాజరయ్యారు. మరుసటి ఏడాది 29 జనవరి 2022న నాగోబాను ముచ్చటగా మూడవసారి దర్శించుకున్నారు. ఆ సమయంలో మరొసారి నాగోబా కు మీరు రావాలని.. ముఖ్యమంత్రిహోదాలో మా దైవాన్ని దర్శించుకోవాలని.. ఆ సమయం దగ్గర లోనే ఉందని.. మెస్రం వంశస్థులు ఆశీస్సులు అందించడం..

సరిగ్గా రెండేళ్లకు ఆ కల నెరవేరడ'ంతో తొలి తెలంగాణ ముఖ్యమంత్రిగా నాగోబాను సీఎం రేవంత్ రెడ్డి దర్శించుకోబోతున్నారు. పీసీసీ ఛీఫ్ గా నాగోబాను దర్శించుకున్న సమయంలో నాగోబా మురాడి దేవాలయ అభివృద్ధి కోసం సొంతంగా నిధులు అందజేస్తానని వారికి హామీ ఇచ్చారు. రూ.40 లక్షలు మేస్రం వంశీయులకు అందజేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ముచ్చటగా నాలుగోసారి సీఎం హోదాలో తొలిసారి రేవంత్ రెడ్డి నాగోబా ఆలయాన్ని దర్శించుకోబోతున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు చేశారు అధికారులు. ముఖ్యమంత్రి తొలి పర్యటన కావడం.. ఛలో ఇంద్రవెల్లి పేరిట విజయభేరి భారీ బహిరంగ సభ నిర్వహించనుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొండత ఉత్సాహం కనిపిస్తోంది. నాగోబాను దర్శించుకున్న ముఖ్యమంత్రుల్లో ముగ్గురు ముఖ్యమంత్రులు ఉమ్మడి రాష్టాన్ని ఏలిన దిగ్గజ నేతలే కావడం విశేషం. మొట్టమొదటిసారి 1995లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామరావు నాగోబా ను దర్శించుకున్నారు. ఆ సమయంలో నాగోబా ఆలయం శిథిలావస్థలో ఉండటంతో ఆలయ అభివృద్దికి కోటి రూపాయల నిధులను అభివృద్ధి కోసం విడుదల చేశారు. ఆరేళ్ల తర్వాత 2001లో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా కెస్లాపూర్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. ఆదివాసీ గిరిజనుల ప్రగతి కోసం పలు సంక్షేమ పథకాలను నాగోబా నుండే ప్రారంభించారు. మరో ఆరేళ్ల తర్వాత 2006లో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి ముచ్చటగా మూడవ ముఖ్యమంత్రిగా నాగోబాను దర్శించుకున్నారు. కెస్లాపూర్ , ఇంద్రవెల్లిలో పర్యటించి రైతుల కోసం సాగునీటి పథకాలు మంజూరు చేశారు. ఆ తర్వాత 2014 లో తెలంగాణ ఏర్పాటైన తర్వాత మొట్టమొదటి సారిగా దశాబ్దం తర్వాత తొలి ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి రానున్నారు.

# ఎపిలో సలహాదారుల కోసమే 680 కోట్ల ఖర్చు

## వారి ద్వారా ఏం సాధించారో చెప్పాలి

## ఎలాంటి ప్రగతి సాధించారో ప్రజలకు వివరించాలి

## దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాల్సిందే: నాదెండ్ల డిమాండ్

**అమరావతి:** వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ సలహాదారుల కోసం రూ.680 కోట్ల ప్రజాధనం ఖర్చుపెట్టి వృధా చేశారని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కోసం ఖర్చు చేసిందే రూ.140 కోట్లు అని ఆరోపించారు. ప్రభుత్వం నియమించిన సలహాదారులు ఎవరు ఎన్ని సలహాలు ఇచ్చారు వారికి ఎంత మేర ఖర్చు చేశారనే వివరాలపై ప్రభుత్వం శాసనసభ వేదికగా సమాధానం చెప్పాలని నాదెండ్ల డిమాండ్ చేశారు. 89 మంది సలహాదారులను ప్రభుత్వం నియమించడం, వారి అర్హతలను ఎవరికి తెలియకుండా దాచిపెట్టడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. నాదెండ్ల మనోహర్ గురువారం మీడియాతో మాట్లాడారు.'సలహదారుల నియామకం విషయంలో హైకోర్టును కూడా ప్రభుత్వం తప్పుదారి పట్టించిందన్నారు. తన ప్రభుత్వంలో ఎంతమంది సలహాదారులు ఉన్నది ముఖ్య మంత్రికి కూడా తెలియదు. అసలు ఎవరి మాట పట్టించుకోని ముఖ్యమంత్రి కనీసం పాలనలో ఒక్క విలేకరుల సమావేశం కూడా నిర్వహించని ముఖ్యమంత్రి సలహా దారుల నుంచి ఏం



సలహాలు తీసుకున్నారో ప్రజలకు తెలియచేయాలన్నారు. వారు ఇచ్చే సలహాలను సీఎం నిజంగా తీసుకుని అమలు చేస్తున్నారా. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించకుండా ఐబీ సిలబస్ అమలు అంటున్నారు. ఏ సలహాదారు చెబితే ఈ విద్యా విధానంలో మార్పు తెచ్చారు. ఈ సలహాదారుల వల్ల ప్రజలకు, రాష్ట్రానికి జరిగిన మేలు ఏంటో ప్రభుత్వం చెప్పగలదా? ఎంతమంది సలహాదారులు ఉన్నారు.. వారెవరో.. కనీసం ముఖ్యమంత్రికి కూడా తెలియదని అన్నారు. 'సీఎంతో రోజూ మాట్లాడేది కేవలం ఇద్దరు సలహాదారులు మాత్రమే. సీఎం మీడియా ముందుకు వచ్చి.. తాను పెట్టుకున్న సలహాదారులు వివరాలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. రూ.140 కోట్లు ఒక్క సజ్జల కోసం ఖర్చు చేస్తే ఏమనుకోవాలి. ప్రభుత్వ సొమ్మును తీసుకొంటూ.. ప్రతిపక్షాలను సజ్జల విమర్శిస్తారా అని నిలదీశారు.జగన్ కు చిత్తశుద్ధి ఉంటే.. ఏపని కోసం సలహాదారులను అమలు చేశారు. వారు ఇచ్చిన సలహాల వల్ల ఏ అంశాలలో మార్పు జరిగాయో పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎంను డిమాండ్ చేస్తున్నాం. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలను వదిలేసి సలహాదారుల కోసం 680 కోట్లు ఖర్చు పెడతారా? ఏ బడ్జెట్ కింద ఈ డబ్బు ఖర్చు పెట్టారో రేపు శాసనసభ సమావేశాల్లో చెప్పాలి. అసలు సలహాదారుల్లో ఎంతమందికి ఆ అర్హత ఉందో చెప్పగలరా? ఒక్క సజ్జల కోసం 140 కోట్లు ఎలా ఖర్చు పెట్టారో సీఎం ప్రజలకు వివరణ ఇవ్వాల్సిందేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మధ్యంతరం బడ్జెట్ భవిష్యత్తు భారతానికి ఒక దిక్సూచి. పర్యాటక రంగానికి పెద్దపీట వేయడం, పేదలకు ఇల్లు నిర్మాణం విషయంలో కేంద్రం ప్రభుత్వం అండగా ఉంటామని చెప్పడం హర్షించదగిన పరిణామం. రైతులు, యువత, మహిళలకు స్వాంతన చేకూర్చే కొన్ని పథకాలను ప్రవేశ పెట్టడం బాగుంది. సౌర విద్యుత్తును ప్రోత్సహించేలా 300 యూనిట్ల కరెంటును ఉచితంగా అందించే పథకం అభినందనీయం' అని నాదెండ్ల కొనియాడారు.

# ఎపి ప్రాజెక్టులకు బడ్జెట్లో మొండిచేయి

## కేంద్ర బడ్జెట్పై గిడుగు రుద్రరాజు ఆగ్రహం

**అమరావతి:** బడ్జెట్లో ఏపీ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం నిరాశ మిగిల్చిందని, వారి ఆశలపై నీళు చల్లిందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు మండిపడ్డారు. కార్పొరేట్లకు మేలు చేకూర్చేలా కేంద్రం కార్పొరేట్ ట్యాక్స్ను తగ్గించిందని ఆరోపించారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్పై వ్యాఖ్యలు చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, దుగరాజపట్నం పోర్టు, పోలవరం ప్రాజెక్టను కేంద్రం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజభన హామీలను అమలు చేయడంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు తగిన నిధులు ఇవ్వాలని, అలాగే నిర్వాసితులకు నష్టపరిహారంగా పునరావాసం కల్పించాలని పీసీసీ లేఖ రాసినా.. ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని ధ్వజమెత్తారు. హోంశాఖ, ఆర్థిక శాఖ మంత్రులకు కూడా లేఖ రాశామని, వారి నుంచి కూడా స్పందన లేదని చెప్పారు. ఎన్డీఏ ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీ తిరుపతికి వచ్చినప్పుడు.. ఏపీకి తప్పకుండా ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ అది నెరవేర్చలేదని గిడుగు రుద్రరాజు విమర్శించారు. అసలు రాష్ట్ర విభజనకు బీజం వేసిందే బీజేపీ అని విరుచుకుపడ్డారు. విభజన చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని, కానీ కేంద్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని నిప్పులు చెరిగారు. కార్పొరేట్లకు దేశాన్ని దోచిపెట్టేలా కేంద్రం వ్యవహరిస్తోందని ఆరోపణలు గుప్పించారు. ఏపీకి కేంద్రం చేస్తున్న నష్టాన్ని పీసీసీ షర్మిల నేతృత్వంలో ఏపీ కాంగ్రెస్ నేతలు జాతీయ నాయకులకు వివరిస్తామని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలుస్తామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని గిడుగు రుద్రరాజు చెప్పుకొచ్చారు.

# మేడారం జాతరలో పర్యావరణ రుసుము జాతర ముగిసే వరకు నిలిపివేత

**హైదరాబాద్:** త్వరలో జరగనున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది. దీనిలో భాగంగా జాతర ముగిసే వరకు అక్కడ అటవీశాఖ వసూలు చేస్తున్న పర్యావరణ రుసుమును నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 29 దాకా పర్యావరణ రుసుము వసూలు నిలిపివేస్తున్నట్లు అటవీ శాఖ తెలిపింది. చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జాతరకు వచ్చే వాహనాలు, రద్దీ నియంత్రణ కూడా కొంత మేరకు సులువు అయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం ములుగు జిల్లా అటవీ అధికారి తక్షణ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో తెలిపారు. ఏటూరు నాగారం అభయారణ్యం పరిధిలో పస్రా, తాడ్వాయి, ఏటూరు నాగారంల నుంచి వచ్చే వాహనాల నుంచి నామమాత్రపు పర్యావరణ రుసుమును ఇప్పటిదాకా అటవీ శాఖ వసూలు చేస్తోంది. ఇలా వచ్చే ఆదాయంలో అటవీ ప్రాంతాల రక్షణకు, ప్లాస్టిక్ను తొలగించేందుకు, వన్యప్రాణుల రక్షణకు అటవీ శాఖ వినియోగిస్తోంది. అయితే వివిధ వర్గాల నుంచి విజ్ఞప్తి మేరకు జాతర ముగిసే దాకా ఈ ఫీజు వసూలు నిలిపివేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులు అటవీ ప్రాంతాన్ని వీలైనంత పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అటవీశాఖ కోరింది.

# హేమంత్ సోరేన్కు ఒకరోజు జ్యుడిషియల్ కస్టడీ

**రాంచీ:** జార్ఖాండ్ను కుదిపేస్తున్న భూ ఆక్రమణల వ్యవహారం కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో ఈడీ అరెస్టు చేసిన జార్ఖాండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కు రాంచీలోని పీఎంఎల్ఏ కోర్టు ఒకరోజు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. పది రోజుల పాటు ఆయనను తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరినప్పటికీ, ఒక రోజు జ్యుడిషియల్ కస్టడీకి కోర్టు ఆదేశాలిచ్చింది. మనీలాండరింగ్ కేసులో బుధవారంనాడు 6 గంటల సుదీర్ఘ విచారణ అనంతరం హేమంత్ సోరెన్ తన రాజీనామాను గవర్నర్కు బుధవారం రాత్రి సమర్పించారు. ఆ కొద్దిసేపటికే ఈడీ ఆయనను అరెస్టు చేసింది. పీఎంఎల్ఏ కోర్టు ముందు గురువారం ఉదయం హాజరుప రిచింది. రోవైపు, మనీలాండరింగ్ కేసు కింద ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ తనను అరెస్టు చేయడాన్ని జార్ఖాండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. పిటిషన్ను విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం శుక్రవారంనాడు విచారణ చేపట్టనున్నట్టు తెలిపింది.

# బడ్జెట్ వేళ స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు

## నష్టాల్లో ముగిసిన ప్రధాన సూచీలు

**న్యూఢిల్లీ:** బడ్జెట్ రోజున దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలలో విపరీతమైన ఒడిదొడుకులు కనిపించాయి. ఉదయం సానుకూలంగా ప్రారంభమైనప్పటికీ, ప్రధాన సూచీలు చివరికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 106 పాయింట్లు క్షీణించి 71,645కు పడిపోయింది. నిఫ్టీ కూడా 28 పాయింట్లు నష్టపోయి 21,697 వద్ద ముగిసింది. కానీ బ్యాంక్ నిఫ్టీ మాత్రం 191 పాయింట్లు వృద్ధి చెందింది. మీడియా, ఫార్మా, రియల్టీ, హెల్త్కేర్ రంగాలలో మార్కెట్లో అతిపెద్ద క్షీణత కనిపించింది. ఇక ప్రభుత్వ బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఆటో రంగాల్లో కొనుగోళు జరిగాయి. అంతకుముందు బుధవారం సెన్సెక్స్ 612 పాయింట్లు నష్టపోయి 71,752 వద్ద ముగిసింది. క్రమంలో గోద్రెజ్ కన్స్యూమర్, మారుతీ సుజుకి, పీఎస్బీ, కంటైనర్ కార్ప్, కెనరా బ్యాంక్ సంస్థల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉండగా...ఇండియా సిమెంట్స్, అరబిందో ఫార్మా, వోల్టాస్, జూబిలెంట్ ఫుడ్, ఎస్కార్ట్స్ కుబోటా సంస్థల స్టాక్స్ టాప్ 5 లూజర్స్గా నిలిచాయి. మరోవైపు మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్లో సామాన్య ప్రజలు ఆశించిన ప్రకటనలు లభించలేదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. దీంతోపాటు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఈ బడ్జెట్ ఉందని పలువురు నేతలు విమర్శించారు. అయితే బ్జడెట్ వేళ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోకి జారుకోవడం పట్ల పలువురు ఇది ఆశాజనక బడ్జెట్ కాదని కామెంట్లు చేస్తున్నారు.







# ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు

## ప్రముఖుల సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్:**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా హార్కర వేణు గోపాలరావు నేడు పదవీ బాధ్యతలను స్వీకరించారు. బి.అర్.అంబేద్కర్ సచివాలయంలో తన కార్యాలయంలో వేదపండితులు నిర్వహించిన పూజల అనంతరం పదవీ భాద్యతలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారుగా పదవీ భాద్యతలు స్వీకరించిన హర్కర వేణుగోపాల్ రావును రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణ మోహన్ రావు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్ రెడ్డి, మాజీ ఎంపీలు వీ హనుమంత రావు, సుబ్బరామిరెడ్డి, మధు యాష్కీ, దీపా దాస్ తదితర ప్రజాప్రతినిధులు పూల గుచ్చాలతో అభినందించారు.

prajamantalau daily pages (02-02-24)G_times of varha main (13-2).qxd 2/2/2024 3:28 AM Page 7



# నేటి నుండి ఇండియా, ఇంగ్లాండ్‌ల మధ్య రెండో టెస్టు



విశాఖలో క్రికెట్ ఫీవర్ మొదలైంది. రేపటి నుండి 5 రోజుల పాటు ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఇంటర్నేషనల్ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ జరగనుంది. రెండు రోజులపాటు ఇరు జట్లు ప్రాక్టీస్‌లో మునిగిపోయాయి. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య రేపు ఉదయం 9:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటల నుండి స్టేడియంలోకి వీక్షకులను సిబ్బంది అనుమతించనున్నారు. రోజుకు 2500 మంది విద్యార్థులకు ఉచితంగా ఎంట్రీ ఇవ్వనున్నారు. 5 మ్యాచ్‌ల టెస్ట్ సీరిస్‌లో నిలవాలంటే ఈ మ్యాచ్ తప్పక గెలవాల్సిందే. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా విశాఖ మ్యాచ్ కీలకంగా మారింది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు ఓడిపోయి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాకింగ్స్ లో మరింత కిందకు దిగజారడమే ఇందుకు ప్రధాన కారణం. విశాఖ వేదికగా జరిగిన గత రెండు మ్యాచ్‌లలోనూ భారత్ భారీ విజయం సాధించింది. విశాఖలో భారత్ ఇప్పటి వరకు రెండు మ్యాచ్‌లు ఆడింది. 2016లో ఇంగ్లండ్‌తో భారత్ తొలి టెస్టు మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 246 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పుజారా సెంచరీలతో చెలరేగారు. అయితే కోహ్లీ, ఛతేశ్వర్ పుజారా రానున్న మ్యాచ్‌లో ఆడకపోవడం రోహిత్ సేనకు ఎదురుదెబ్బ లాంటిదే. దీని తర్వాత, 2019లో దక్షిణాఫ్రికాతో భారత్ ఇక్కడ రెండో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్‌లోనూ భారత్ 203 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ సిరీస్‌లో తొలి టెస్టుకు ముందు ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ రెండో స్థానంలో ఉంది. అయితే ఇప్పుడు తొలి టెస్టులో ఓటమితో నేరుగా 5వ స్థానానికి పడిపోయింది. అయితే తర్వాతి మ్యాచ్‌లో గెలిచిన వెంటనే టీమ్ ఇండియా కోల్పోయిన స్థానాన్ని తిరిగి పొందుతుంది. ఇదిలా ఉంటే స్వదేశంలో గత మూడు టెస్టు మ్యాచ్‌ల్లో భారత జట్టు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది.

### విశాఖలో ఇద్దరిలో అరంగేట్రం చేసేదెవరు?

భారత్-ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో రెండో టెస్టు విశాఖపట్నంలో జరగనుంది. అయితే టీమ్ ఇండియా ప్లేయింగ్ ఎలెవన్ ఏలా ఉంటుందనే అంశంపై కీలక చర్చలు జరుగుతున్నాయి. తొలి 2 టెస్టు మ్యాచ్‌ల నుంచి విరాట్ కోహ్లీ తన పేరును ఉపసంహరించుకున్నాడు. దీంతో పాటు రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ గాయం కారణంగా ఆడలేరు. తాజాగా యువ బ్యాట్స్‌మెన్ సర్ఫరాజ్ ఖాన్ టీమ్ ఇండియాలో చోటు దక్కించుకున్నాడు. అలాగే టీమ్ ఇండియా మిడిలార్డర్‌లో రజత్ పాటిదార్ కూడా ఉంటాడు. సర్ఫరాజ్ ఖాన్ లేదా రజత్ పాటిదార్.. ప్లేయింగ్ ఎలెవన్‌లో ఏ ఆటగాడికి అవకాశం దక్కుతుంది? ఈ ప్రశ్నకు టీమిండియా బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ సమాధానమిచ్చాడు. సర్ఫరాజ్ ఖాన్, రజత్ పాటిదార్ మధ్య ఎంపిక అంత సులభం కాదని టీమిండియా బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అభిప్రాయపడ్డాడు. ఇద్దరూ అద్భుతమైన ఆటగాళ్లు. దేశవాళీ క్రికెట్‌లో సర్ఫరాజ్ ఖాన్, రజత్ పటీదార్ల ప్రదర్శన ఎంత అద్భుతంగా ఉందో మనం చూశాం. ఈ రకమైన వికెట్‌పై, సర్ఫరాజ్ ఖాన్, రజత్ పాటిదార్ ఇద్దరూ ఫ్యాక్టర్‌గా నిరూపించగలరని నేను నమ్ముతున్నాను. అయితే ఈ ఇద్దరిలో ఒకరిని ఎంచుకోవాల్సి వస్తే అది అంత సులువు కాదని తెలిపాడు. సర్ఫరాజ్‌ఖాన్, రజత్ పటీదార్‌లలో ఎవరికి అవకాశం దక్కాలనే దానిపై కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ నిర్ణయం తీసుకుంటారని విక్రమ్ రాథోడ్ అన్నాడు. ప్లేయింగ్ ఎలెవన్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేయనున్నారు. దీంతో పాటు విశాఖ పిచ్‌పై టీమిండియా బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ప్రస్తుతం పిచ్‌పై ఊహాగానాలు చేయడం కష్టమని అన్నాడు. అయితే, ఈ పిచ్‌పై స్పిన్నర్లకు సహాయం అందుతుంది. కానీ, బహుశా మొదటి రోజు మాత్రం కాకపోవచ్చు. ఏది ఏమైనా, సర్ఫరాజ్ ఖాన్, రజత్ పాటిదార్ మధ్య ఎవరికి అవకాశం లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. టీమిండియా ప్రాబబుల్ ప్లేయింగ్ 11: రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్, రజత్ పాటిదార్/సర్ఫరాజ్ ఖాన్, కేఎస్ భరత్, అక్షర్ పటేల్, ఆర్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, సౌరభ్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

## విశాఖలో రోహిత్ శర్మ రికార్డులు

ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఫిబ్రవరి 2 నుంచి విశాఖపట్నంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో మ్యాచ్ జరగనుంది. ఉప్పల్ మైదానంలో జరిగిన తొలి టెస్టులో విజయం సాధించిన ఇంగ్లండ్.. రెండో మ్యాచ్‌లో గెలిచి సిరీస్ కైవసం చేసుకునే దిశగా దూసుకెళ్లనుకుంటోంది. మరోవైపు మొదటి మ్యాచ్‌లో ఓడిన భారత్.. ఈ టెస్టులో గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని భావిస్తోంది. రెండో టెస్టులో విరాట్ కోహ్లీతో పాటు రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ లేకపోవడం టీమిండియాకు ప్రతికూలంగా మారింది. అయితే విశాఖలో కెప్టెన్ రోహిత్ శర్మ రికార్డులు బాగుండడం ఊరట కలిగించే విషయం. విశాఖలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఒక టెస్ట్ మ్యాచ్ ఆడాడు. రెండు ఇన్నింగ్స్‌లలో 151.50 సగటుతో 303 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 176 పరుగులు చేసిన రోహిత్.. రెండో ఇన్నింగ్స్‌లో 127 పరుగులు చేశాడు. విశాఖలో టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మెన్ కూడా రోహితే. విరాట్ కోహ్లీ (299), మయాంక్ అగర్వాల్ (222), ఛతేశ్వర్ పుజారా (207), అజింక్యా రహానే (91)లు టాప్-5లో ఉన్నారు. విశాఖపట్నంలో రోహిత్ శర్మ మూడు ఫార్మాట్‌లలోని 4 ఇన్నింగ్స్‌ల్లో 3 సెంచరీలు చేశాడు. 4 ఇన్నింగ్స్‌ల్లో 176, 127, 159, 13 పరుగులు చేశాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో రోహిత్ 159 పరుగులు చేశాడు. ఇప్పటివరకు భారత్ తరఫున రోహిత్ 55 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 3800 పరుగులు చేశాడు. ఇందులో16 హాఫ్ సెంచరీలు, 10 సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోర్ 212. రోహిత్ టెస్టుల్లో లేటుగా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. 2007 టీ20 అరంగేట్రం చేసిన రోహిత్.. 2013లో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు.

## జాక్ లీచ్ స్థానంలో షోయబ్ బషీర్‌కు అవకాశం

### రెండో టెస్టు కోసం జట్టును ప్రకటించిన ఇంగ్లండ్

భారత్‌తో జరుగుతున్న 5 టెస్టుల సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో బరిలోకి దిగే ఇంగ్లాండ్ ప్లేయింగ్ 11ను ప్రకటించింది. ఈ జట్టులో 2 మార్పులు చేశారు. మోకాలి గాయం కారణంగా రెండో టెస్టుకు దూరమైన జాక్ లీచ్ స్థానంలో షోయబ్ బషీర్‌కు అవకాశం లభించింది. దీంతో పాటు ప్లేయింగ్ 11లో మార్క్ వుడ్ స్థానంలో జేమ్స్ అండర్సన్ చోటు దక్కించుకున్నాడు. ఈ సిరీస్‌లో రెండో టెస్టు ఫిబ్రవరి 2 నుంచి విశాఖపట్నంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. అంతకుముందు సిరీస్‌లో ఇంగ్లండ్ 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. షోయబ్ బషీర్ తన కెరీర్‌లో ఇప్పటివరకు 6 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. ఈ కాలంలో, 10 ఇన్నింగ్స్‌లలో అతను 67.00 సగటు, 3.30 ఎకానమీతో 10 వికెట్లను సాధించాడు. 6/155 మ్యాచ్‌లో అతని అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. ఇది కాకుండా, అతను ఈ ఫార్మాట్‌లో 71 పరుగులు కూడా చేశాడు. బషీర్ 7 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 3 వికెట్లు తీశాడు. ఇది కాకుండా, అతను 5 %ు%-20 మ్యాచ్‌లలో 2 వికెట్లు తీసుకున్నాడు. జేమ్స్ అండర్సన్ టెస్ట్ గణాంకాల గురించి మాట్లాడితే, అతను ఇప్పటివరకు 183 టెస్టులు ఆడిన 341 ఇన్నింగ్స్‌లలో 690 వికెట్లు తీశాడు. 11/71 టెస్టులో అతని అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా నిలిచింది. ఇంగ్లండ్ తరపున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.

# విజయ్ తనకు బాగా కావాల్సిన వాడు

## నటి రష్మిక మందన్న అంతరంగం



రష్మిక మందన్న ఇప్పుడు మళ్ళీ వార్తల్లో వుంది. ఒక బాలీవుడ్ మీడియాకి తను ఇంటర్వ్యూ ఇచ్చింది, అందులో అన్ని విషయాలు గురించి మాట్లాడుతూ, విజయ్ దేవరకొండ గురించి కూడా మాట్లాడింది. అంటే అతను తనకి ఎంత కావలసినవాడు, అతనితో తనకున్న అనుబంధం అన్నిటికీ ఒక క్లారిటీ ఇచ్చేసింది. తన జీవితంలో విజయ్ ఎటువంటి పాత్ర పోషించాడు అనే విషయం మీద కూడా రష్మిక ఆ ఇంటర్వ్యూ లో మాట్లాడింది. తామిద్దరూ నటులుగా కలిసి పెరిగామని చెప్పుకొంచింది. అందువలన అతను తనకి బాగా కావాల్సిన వాడని, తన జీవితంలో అతని పాత్ర చాలా ముఖ్యమైనది అని కూడా చెప్పింది రష్మిక. 'నా జీవితంలో నేను ఏమి చేసినా అందులో అతని కాంట్రిబ్యూషన్ ఖచ్చితంగా ఉంటుంది. నేను చేసే ప్రతి పనిలో అతని సలహా తీసుకుంటాను, అతని అభిప్రాయం తనకు ఎంతో అవసరమని' రష్మిక ఈ ఇంటర్వ్యూ లో చెప్పింది. ఏదైనా సలహా అడిగితే అతను వెంటనే అవుననే, కాదనో చెప్పాడని, అది ఎందుకు మంచిది, అది ఎందుకు చెయ్యకూడదు అనే విషయాల మీద కూలంకషంగా చెప్పి అప్పుడు తన సలహా ఇస్తాడని చెప్పింది రష్మిక. అందుకే అతను తన జీవితంలో వ్యక్తిగతంగా అందరికంటే ఎంతో ముఖ్యమైన వ్యక్తి అని అతను అంటే ఎంతో గౌరవభావం ఉంటుందని, విజయ్ దేవరకొండ గురించి రష్మీక ప్రస్తావించింది. ఇప్పుడు చెప్పిన ఈ విషయాలను బట్టి, రష్మిక, విజయ్ దేవరకొండల మధ్య వున్న బంధం ఎటువంటిదో అందరికీ అర్థం అయిపోయి ఉంటుంది. ఈమధ్యనే రష్మిక నటించిన హిందీ సినిమా 'యానిమల్' చాలా పెద్ద విజయం సాధించి రష్మిక కి మంచి పేరు తీసుకు వచ్చింది. రణబీర్ కపూర్ ఇందులో కథానాయకుడు, సందీప్ వంగ దర్శకుడు. తెలుగులో కూడా కొన్ని పెద్ద ప్రాజెక్టులు రష్మిక చేతిలో వున్నాయి.

# కామాక్షి..అందాల ఆరబోత

సినిమాల్లో ఒక విధంగా..అంటే అందంగా, చీరకట్టు ఇలా సంప్రదాయంగా కనిపించే హీరోయిన్లు ..బయట మాత్రం రఫ్ఫాడిస్తారు. వెండితెర మీద సినిమా చూస్తున్నప్పుడు అందులోని కథానాయికలు ఒకలా కనపడతారు, అదే నిజ జీవితంలో సామజిక మాధ్యమంలో వాళ్ళు పోస్ట్ చేసిన ఫోటోలు చూస్తే తెరమీద చూసింది వీళ్ళనేనా అనే సందేహం వస్తుంది. అంతలా ఒకదానితో ఒకటి అసలు పోలికలు వుండవు. 'మా ఊరి పొలిమేర' సినిమా రెండు పార్టులుగా వచ్చింది, మొదటిది డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో నేరుగా విడుదలైతే, రెండోది థియేటర్స్ లో విడుదలైంది. మొదటి పార్టులో ఎంతో బోల్డ్ పాత్రలో కనపడిన కామాక్షి ఆ సినిమాలో ఒక పల్లెటూరి ఆమె పాత్రలో ఒదిగిపోయింది. ఆ సినిమా ఆమెకి మంచి పేరు తీసుకువస్తే, రెండో పార్టులో కూడా ఆమె అదే పాత్రని కంటిన్యూ చేశారు. ఆ సినిమా పెద్ద విజయం సాధించింది, కామాక్షికి మంచి పేరు తీసుకు వచ్చింది. ఇప్పుడు టాలీవుడ్ ఆమె ఇంకా మంచివి, పెద్దవి చెయ్యాలని అనుకుంటోంది. నిజ జీవితంలో డాక్టర్ గా వున్న కామాక్షి 'పొలిమేర' సినిమా చేతబడి నేపథ్యంగా వచ్చిన కథ కావటంతో, అటువంటివి తాను నమ్మను అని చెప్పారు. ఆ సినిమాకి మాటలు రాయటంలో కూడా కామాక్షి సహాయం చేశారు, అలాగే దర్శకత్వ శాఖలో కూడా పని చేశారు. అన్నీ నేర్చుకోవాలి, తెలుసు కోవాలని అని అంటున్న ఆమె ముందు ముందు దర్శకత్వం చేస్తానేమో అని కూడా చెప్పారు. ఇప్పుడు ఆమె ఒక గ్లామరస్ ఫోటో ఒకటి ఆమె ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. అది ఇప్పుడు వైరల్ అవుతోంది. అసలు 'పొలిమేర' సినిమాల వేసింది ఈమేనా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు. అంతలా ఈ గ్లామర్ ఫోటోలో కనిపిస్తున్నారు కామాక్షి.







# పెళ్ళికి ఇప్పుడే తొందర లేదంటున్న తృప్తి డిమ్రి

యానిమల్ సినిమాతో మంచి గుర్తింపుతో పాటు.. ముందుగా గుర్తొచ్చే పేరు త్రిప్తి డిమ్రి .అంతకుముందు ఓ డజన్ సినిమాలకు పైగా చేసిన ఆమెకు రాని గుర్తింపు ఈ ఒక్క చిత్రంతో రావడమేగాక ఓవర్‌నైట్ స్టార్ స్టేటస్ సంపాధించింది. ప్రపంచవ్యాప్తంగా మంచి ఫాలోయింగ్, గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం అ అమ్మడు పేరు వాడుకోకుండా ఏ మీడియా సంస్థ లేదంటే అతిశయోక్తి కాదు. ఏదో సందర్భంలో ఆమెకు సంబంధించిన ఏదో ఓ వార్త అయ్యేలా ఘనత దక్కించుకుంది. అయితే ఈ ఒక్క యానిమల్ సినిమాతో సాధించిన పేరుతో ఆఫర్లు త్రిప్తి డిమ్రి ఇంటి తలుపు తడుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే తెలుగులో రెండు చిత్రాలకు సైన్ చేసినట్లు తెలుస్తోందగా నమరో నాలుగు బాలీవుడ్ చిగ్రాలను లైన్‌లో పెట్టినట్టు సమాచారం. అయితే ఈ ముద్దగమ్మ త్వరలోనే పెళ్లి చేసుకోబోతుందనే వార్త నెట్టింట బాగా హల్‌చల్ చేస్తోంది. దే విషయమై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో త్రిప్తి డిమ్రి మాట్లాడుతూ పెళ్లికి సంబంధించి తన మనసులోని మాటను బయట పెట్టింది. ఇప్పట్లో తనకు పెళ్లి చేసుకోవాలనే కోరిక లేదని, ప్రస్తుతానికి నా కేరీర్ పైనే దృష్టి పెట్టానని 2030 తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేసింది. అయితే నాకు కాబోయే భర్తకు చిల్లి గవ్వ ఉండకున్నా ఫర్వాలేదని మంచి మనసు ఉండి అవతలి వారిని అర్థం చేసుకునే గుణం ఉంటే చాలని తెలిపింది. దీంతో ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com